www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 162 | ఆదివారం 02.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# ఆదాయంలో ఆల్-టైమ్ రికార్డు

**19%**

## జీఎస్టీ ద్వారా రూ.4,452 కోట్లు
## జీఎస్టీటీ వసూళ్లు రూ.75,819 కోట్లు

- జులైలో రూ.7,865 కోట్లతో వాణిజ్య పన్నుల శాఖ ఆల్‌టైమ్ రికార్డు
- జీఎస్టీ వృద్ధిలో దేశంలో హర్యానా తర్వాత తెలంగాణకు రెండో స్థానం
- 19%ఆదాయ వృద్ధితో గత రికార్డు బద్దలు
- డేటా అనలిటిక్స్‌తో పన్ను ఎగవేతపై ఉక్కుపాదం
- రూ.300 కోట్ల బోగస్ ఐటీసీ యత్నం వెలుగులోకి
- 165 మంది నకిలీ బిల్లుల ముఠాపై చట్టపరమైన చర్యలు
- సకాలంలో పన్నులు చెల్లించిన 4.61 లక్షల మందికి కమిషనర్ కృతజ్ఞతలు
- ఆర్థిక పురోగతి, కఠిన పర్యవేక్షణతో పెరిగిన పన్ను వసూళ్లు
- పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలతో భారీ ఆదాయం
- తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖకు చరిత్రాత్మక జులై

02



జీఎస్టీ వృద్ధిలో దేశంలో హర్యానా తర్వాత తెలంగాణకు రెండో స్థానం

గతంలో ఏప్రిల్ 2026లో వచ్చిన 77,598 కోట్ల రాబడియే ఇప్పటివరకు అత్యధికం కాగా, ఈ జులైలో సేకరించిన 77,865 కోట్లతో ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జులై 2025లో వచ్చిన 76,624 కోట్లతో పోలిస్తే, ఈసారి రూ. 1,241 కోట్లు (19% వృద్ధి) అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తం రాబడిలో జీఎస్టీ ఆదాయమే రూ. 4,452 కోట్లుగా ఉంది. గతేడాది జులై (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22% పెరుగదల కనిపిస్తోంది. తెలంగాణలోని పన్ను చెల్లింపుదారుల నుండి వసూలైన మొత్తం జీఎస్టీటీ రాబడి

## రూ.300 కోట్ల బోగస్ ఐటీసీ యత్నం వెలుగులోకి

# మెట్రోలో ప్రత్యేక గ్రీన్ కారిడార్

**25 నిమిషాల్లో ప్రాణం కాపాడిన హైదరాబాద్ మెట్రో..**



- అవయవ మార్పిడికి మెట్రోలో ప్రత్యేక గ్రీన్ కారిడార్
- 14 కి.మీ. దూరం కేవలం 25 నిమిషాల్లో పూర్తి
- కేర్ నుంచి కిమ్స్‌కు గుండె, ఊపిరితిత్తుల సురక్షిత రవాణా
- ప్రాణరక్షణలో మరోసారి మెట్రో సేవలకు ప్రశంసలు

02



# మోడీకి చిదంబరం ప్రశ్న

## బీజేపీ ట్రోల్స్‌ను కూడా క్షమించారా?..

- ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎదురుదాడి
- సోషల్ మీడియా పోస్టుతో రాజకీయ వేడి
- జంతర్ మంతర్ ఘటనపై కొనసాగుతున్న రాజకీయ రగడ
- మోడీ క్షమాపణ వ్యాఖ్యలపై కాంగ్రెస్ విమర్శలు
- బీజేపీ ట్రోల్స్‌పై ప్రధాని వైఖరి ఏంటి?: చిదంబరం

02

# సైన్యం సిద్ధం..

- ఈసారి కోలుకోలేని విధంగా దెబ్బ కొడతాం

05



# పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల

**ఆగస్టు 19 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ**


*7,437 ఖాళీల భర్తీకి టీజీపీఆర్‌బీ గ్రీన్ సిగ్నల్*

- భారీ పోలీసు నియామకాలకు దరఖాస్తుల షెడ్యూల్ విడుదల
- 7,437 ఖాళీల భర్తీకి టీజీపీఆర్‌బీ గ్రీన్ సిగ్నల్
- ఆగస్టు 19 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూపులకు తెర
- ఎస్సై నుంచి కానిస్టేబుల్ వరకు వేలాది పోస్టులు

02

ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుంది 'వన్‌టైమ్' ఫీజు

పోలీసు, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీ నియామకాలు





# జేఎన్‌టీయూహెచ్.. పదవుల పోరు..

## బలి అవుతున్న విద్యార్థుల భవిష్యత్తు?

'స్టాండ్ విత్ వీసీ' ర్యాలీలతో క్యాంపస్‌లో కలకలం

రిజిస్ట్రార్ నియామకంతో మొదలైన వివాదం



- విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తున్న అంతర్గత విభేదాలు
- రాజకీయ ఆరోపణలతో రగులుతున్న జేఎన్‌టీయూహెచ్
- విశ్వవిద్యాలయ ప్రతిష్టపై వివాదాల నీడ
- పదవుల పోరులో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- వీసీకి మద్దతుగా సిబ్బంది.. వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు
- క్యాంపస్‌లో చదువుల కంటే వివాదాలే హాట్‌టాపిక్
- జేఎన్‌టీయూహెచ్‌లో అసలు ఎజెండా ఎవరిది?
- పరిపాలనపై ప్రశ్నలు.. క్యాంపస్‌లో రెండు వర్గాలు
- వీసీ కంటతడిపై విద్యార్థి సంఘాల విమర్శలు

02



# మోడీపై కేటీఆర్ హాట్ కామెంట్స్

**'జెన్ జీ పిల్లలు సీబీఐ, ఈడీకి భయపడరు'**

**'జెన్ జీ దెబ్బకు మోడీ అర్ధరాత్రి వీడియో'**

- సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా యువత పోరాటం: కేటీఆర్
- వాట్సాప్ అంకుల్స్ వర్సెస్ ఇన్‌స్టాగ్రామ్ జనరేషన్
- సోషల్ మీడియాపై ఆంక్షలను కేటీఆర్ ప్రశ్నించారు
- ప్రతిపక్షాలు చేయలేనిది యువత చేసి చూపింది
- యువత దేశానికి కొత్త దారి చూపిందన్న కేటీఆర్
- ప్రభుత్వాలు మీడియాను మేనేజ్ చేస్తున్నాయన్న ఆరోపణ
- 'స్వేచ్ఛకు హద్దులు పెడితే వాక్ స్వాతంత్రం ఎక్కడ?'
- రేవంత్ వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్ గౌడ్‌కు కేటీఆర్ విజ్ఞప్తి
- సోషల్ మీడియా లేకపోతే మార్పు వచ్చేది కాదన్న కేటీఆర్
- మోడీ ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే పెట్టుకున్నారు
- యువత ఆగ్రహం ముందు అధికార అహంకారం నిలవలేదు

03

'స్వేచ్ఛకు హద్దులు పెడితే వాక్ స్వాతంత్రం ఎక్కడ?'




# స్వర్ణాంధ్ర విజన్కు కీలకమైన రోజు

- భోగాపురం విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన మోడీ
- ఆంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయి
- రూ.18 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఉత్తరాంధ్రకు కొత్త అభివృద్ధి ద్వారం తెరిచిన భోగాపురం
- అల్లూరి పేరుతో విమానాశ్రయం.. గర్వకారణమన్న మోడీ
- భోగాపురంలో థిమ్సా నృత్యం ప్రధాని మనసు దోచుకుంది
- విమానయాన రంగంలో దేశం కొత్త శిఖరాలకు

03

**భోగాపురం నుంచి అభివృద్ధికి కొత్త రెక్కలు**

తెలుగులో అందరికీ నమస్కారం చెబుతూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ, సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి నమస్కారాలు తెలియజేసి, పవిత్రమైన ఉత్తరాంధ్ర నేలపై అడుగుపెట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ఈ సందర్భంగా రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేసినట్లు ప్రధాని తెలిపారు.

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ..

## జూరాల ప్రాజెక్ట్ 29 గేట్లు ఎత్తివేత

- 1.52 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- 1.45 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- ఎగువ ప్రాంతాల వర్షాలతో జూరాలకు వరద ఉధృతి
- కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక
- ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది
- విద్యుత్ ఉత్పత్తితో పాటు భారీ నీటి విడుదల
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జూరాల నుంచి కాలువలకు నీటి సరఫరా కొనసాగింపు
- ప్రాజెక్టు నీటిమట్టం 318.01 మీటర్లకు చేరిక

05

**జూరాలకు కొనసాగుతున్న వరద ఉధృతి..**



# మోడీకి చిదంబరం ప్రశ్న

## బీజేపీ ట్రోల్స్‌ను కూడా క్షమించారా?..



**ఢిల్లీ :** ఢిల్లీ జంతర్ మంతర్ ఆందోళన తర్వాత సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ పోస్టు చేస్తున్న వీడియోలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. తాజాగా శనివారం రాత్రి ప్రధాని రిలీజ్ చేసిన వీడియో సందేశంపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం విమర్శలు గుప్పించారు. తనపై అసభ్యవ్యాఖ్యలు చేసిన పిల్లలను క్షమిస్తున్నానని చెప్పిన నరేంద్ర మోడీ.. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పెట్టే పోస్టులపై అసభ్యకరమైన, నీచమైన కామెంట్లతో దాడి చేసే బీజేపీ ట్రోల్స్‌ను కూడా క్షమించేశారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఇవాళ చిదంబరం ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ప్రతిపక్షాలపై నిత్యం సామాజిక మాధ్యమాల్లో అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేసే బిజెపి ట్రోల్స్ పట్ల ప్రధాని వైఖరి ఏమిటని చిదంబరం ప్రశ్నించారు.

**ప్రధాని మోడీ వ్యాఖ్యల నేపథ్యం**

ఇటీవల జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనల్లో కొందరు యువతులు తనతో పాటు తన దివంగత తల్లిని ఉద్దేశించి అత్యంత అసభ్యకర పదజాలం ఉపయోగించారని ప్రధాని మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆ పిల్లల్ని క్షమిస్తున్నాను. వయసు రీత్యా పిల్లలు పొరపాట్లు చేయడం సహజం. అందువల్ల వారిని కోర్టు చుట్టూ తిప్పడం, శిక్షించడం కంటే, ప్రేమతో దగ్గరకు తీసి సరైన మార్గం చూపించడమే సమాజంగా మన బాధ్యత. అందుకే నేను వారిని క్షమిస్తున్నాను అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ పై రకంగా రియాక్ట్ కావడం ఆసక్తిగా మారాయి.



# న్యాయపోరాటం ఫలించింది..

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులైన గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్‌లకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంతో సంప్రదింపులు జరిపారని కొనియాడారు. అభిషేక్ సింఘ్వి వంటి ప్రముఖ న్యాయవాదులతో సుప్రీంకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే ఈ సానుకూల తీర్పు వచ్చిందన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చి ఈ తీరృతో ప్రాజెక్టుల నిర్మాణ పనులకు సరికొత్త వేగం పుంజుకోనుందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల తాగునీటి అవసరాలూ పూర్తిగా తీరనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణలో సీఎం తీసుకున్న చొరవ, జరిపిన న్యాయపోరాటం అభినందనీయమని పొన్నం స్పష్టం చేశారు.

# ఆదాయంలో ఆల్-టైమ్ రికార్డు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. జులై 2026 నెలలో అత్యధికంగా రూ.7,865 కోట్ల ఆదాయాన్ని సేకరించి, ఇప్పటివరకు ఒక్క నెలలో వచ్చిన గరిష్ట ఆదాయంగా కొత్త చరిత్ర నమోదు చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్థిక పురోగతి, మెరుగైన పన్ను నిబంధనల అమలు, శాఖ చేపడుతున్న పటిష్టమైన చర్యల వల్ల ఈ ఘనత సాధ్యమైంది.

**సరికొత్త ఆల్-టైమ్ రికార్డు..**

గతంలో ఏప్రిల్ 2026లో వచ్చిన 77,598 కోట్ల రాబడియే ఇప్పటివరకు అత్యధికం కాగా, ఈ జులైలో సేకరించిన 77,865 కోట్లతో ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జులై 2025లో వచ్చిన 76,624 కోట్లతో పోలిస్తే, ఈసారి రూ. 1,241 కోట్లు (19% వృద్ధి) అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తం రాబడిలో జీఎస్టీ ఆదాయమే రూ. 4,452 కోట్లుగా ఉంది. గతేడాది జులై (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22% పెరుగుదల కనిపిస్తోంది. తెలంగాణలోని పన్ను చెల్లింపుదారుల నుండి వసూలైన మొత్తం జీఎస్టీటీ రాబడి (IGST, CGST, SGST కలిపి) 75,819 కోట్లకు చేరింది. జులై నెల జీఎస్టీ వృద్ధిరేటు (19%) విషయంలో దేశంలోనే హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. అఖిల భారత సగటు వృద్ధిరేటు 10%గా మాత్రమే ఉంది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, కొత్త పెట్టుబడులు రావడం, వినియోగం పెరగడమే కాకుండా.. పన్ను ఎగవేతదారులపై సాంకేతికత సాయంతో కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ రాబడి సాధ్యమైందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎమ్. రఘునందన్ రావు తెలిపారు.

**రూ.7300 కోట్ల నకిలీ ఐటీసీ స్కామ్ గుర్తింపు..**

జూలై నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరఫరా లేకుండానే బోగస్ బిల్లులతో రూ. 300 కోట్ల మేర ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ పొందేందుకు యత్నించిన 165 మంది. పన్ను చెల్లింపుదారులను గుర్తించి, వారి రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టారు. సక్రమంగా పన్ను చెల్లించే వారిని గౌరవిస్తూనే, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేసే వారిపై జీఎస్‌టీ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. సకాలంలో పన్నులు చెల్లించిన 4,61,276 మంది తెలంగాణ పన్ను చెల్లింపుదారులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.



# సికింద్రాబాద్‌లో పండుగ శోభ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి (లష్కర్) బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. చారిత్రాత్మక అమ్మవారి ఆలయం విద్యుత్ దీపాలంకరణలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు సులభంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా 6 క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. బోనాలతో వచ్చే మహిళా భక్తుల కోసం 2 క్యూ లైన్లు, సాధారణ దర్శనం కోసం 2 జనరల్ లైన్లు, ప్రముఖులు, వీఐపీల కోసం 2 వీఐపీ లైన్లు అందుబాటులో ఉంటాయి.

**పటిష్ట భద్రత & మౌలిక వసతులు..**

జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో 5 వాటర్ క్యాంపులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 3 మెడికల్ క్యాంపులను అందుబాటులో ఉంచారు. బోనాల జాతర నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు. ఆలయానికి దాదాపు 500 మీటర్ల దూరంలో ప్రత్యేక పార్కింగ్ స్లాట్లను ఏర్పాటు చేశారు. వాహనాలను పార్కింగ్ స్థలాల్లోనే నిలిపివేసి, కాలినడకన ఆలయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

# తహసీల్దార్ పై మంత్రి తీవ్ర ఆగ్రహం

**షాబాద్,ఫ్లాష్ ఇండియా :** షాబాద్ మండల తహసీల్దార్ ఎండీ అన్వర్ వ్యవహారం పై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కేటాయిస్తున్న ప్లాట్లకు సంబంధించిన వివరాలను ముందుగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చేరవేస్తూ, కొంతమందితో కలిసి భూ వ్యాపారాలు జరుగుతున్నాయనే ఆరోపణలను షాబాద్ మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదును మంత్రి తీవ్రంగా పరిగణించి, తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవచేయడానికి నియమించబడిన వారేనని, ప్రజల ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయ నాయకులు, దళారులు లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం పనిచేయడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. రైతులకు కేటాయించే ప్లాట్లు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగమని, వాటిని కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించే ప్రయత్నాలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని పేర్కొన్నారు.రైతులకు సంబంధించిన భూములు, ప్లాట్ల వివరాలు గోప్యంగా ఉండాల్సిన సమయంలో వాటిని బయటకు చేరవేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అవకాశం కల్పించడం అత్యంత తీవ్రమైన విషయమని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు రైతుల హక్కులకు భంగం కలిగించడమే కాకుండా, ప్రభుత్వం పై ప్రజల్లో అనుమానాలు పెరిగే పరిస్థితిని తీసుకొస్తాయని ఆయన అన్నారు. అధికారులు తమ విధులను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ప్రతి నిర్ణయం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు, నిర్లక్ష్యం చోటుచేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి హక్కులను పరిరక్షించడం ప్రతి అధికారి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు

పునరావృతం కాకుండా తహసీల్దార్ తన పనితీరును మెరుగుపరచాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజలతో, రైతులతో మాట్లాడేటప్పుడు అధికారులు ఓపికతో వ్యవహరించాలని తెలిపారు.

# పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (TSLPRB) పోలీసు, ట్రాఫిక్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి కీలక అప్ డేట్ వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీలను వెల్లడించింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 19వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in లో దరఖాస్తులు చేసుకోవచ్చని బోర్డు చైర్మన్ వి. వి. శ్రీనివాసరావు IPS తెలిపారు. దరఖాస్తులను కేవలం ఆన్ లైన్ లో మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని ఇతర రూపాల్లో వచ్చే దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

**ఇటీవలే నోటిఫికేషన్ రిలీజ్:**

పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్, ఎమర్జెన్సీ, జైలు విభాగాల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించిన మొత్తం నాలుగు నోటిఫికేషన్లను TSLPRB గత నెల 29వ తేదీన విడుదల చేసింది. అయితే దరఖాస్తుల ప్రారంభానికి సంబంధించిన ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో తాజాగా దరఖాస్తుల తేదీలను ప్రకటించింది.

**వన్ టైమ్ ఫీజు:**

పరీక్ష రుసుముకు సంబంధించి, మొత్తం నియామక ప్రక్రియ ముగిసే వరకు (దరఖాస్తు రుసుము, ప్రాథమిక రాత పరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్/ఎఫిషియెన్సీ టెస్టులు, తుది రాత పరీక్ష మరియు బయోమెట్రిక్స్ వంటి అన్ని దశలకు) అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే ఈ 'వన్-టైమ్ ఫీజు' చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సై, సబ్ ఇన్ స్పెక్టర్ స్థాయి పోస్టులు (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ, సార్సిపిఎల్, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్, ఏఎస్సై ఎఫ్‌పీబీ)లకు తెలంగాణకు చెందిన స్థానిక రాజ మరియు రా అభ్యర్థులకు పరీక్ష రుసుము రూ. 750, ఇతర అభ్యర్థులందరికీ (OC, BC మరియు ఇతరులు) రూ.1,500గా నిర్ణయించారు.

అలాగే కానిస్టేబుల్, ఫైర్‌మేన్, వార్డర్, ఇతర డ్రైవర్, మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే స్థానిక SC/ST అభ్యర్థులకు రుసుము రూ.600 కాగా, ఇతర అభ్యర్థులందరికీ రూ.1,200గా నిర్ణయించారు.

# జేఎన్‌టీయూహెచ్.. పదవుల పోరు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణలోనే ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థ అయిన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) ప్రస్తుతం తీవ్ర వివాదాలు, వర్గపోరుతో రగిలిపోతోంది. రోజువారీ బోధన, విద్యార్థుల భవిష్యత్తును దిద్ది తీర్చాల్సిన యూనివర్సిటీ ప్రాంగణం.. అధికారిక పోరాటాలు, రాజకీయ ఒత్తిళ్లు, పరస్పర ఆరోపణలతో రాజకీయాఖాడాగా మారిపోయింది.

**'స్టాండ్ విత్ వీసీ' నిరసనలు.. విమర్శలు**

రిజిస్ట్రార్ నియామకం చుట్టూ సాగుతున్న రాజకీయ ఒత్తిళ్లపై వైస్ ఛాన్సలర్ కిషన్ రెడ్డి ఇటీవల తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం క్యాంపస్‌లో పెద్ద చర్చనీయాంశమైంది. వీసీకి మద్దతుగా టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అంతా ఏకమై 'స్టాండ్ విత్ వీసీ' పేరుతో క్యాంపస్‌లో ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. మెజారిటీ ఫ్యాకల్టీ, సిబ్బంది తనవైపే ఉన్నారని నిరూపించుకుంటూ వీసీ ఈ ప్రదర్శనల ద్వారా తన బలాన్ని చాటుకున్నారు. అయితే, ఈ సన్నివేశంపై విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. వీసీ కంటతడి పెట్టడం కేవలం సానుభూతి కోసమేనని, అదంతా ఒక డ్రామా అని వారు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

**పాఠాలు పక్కనపెట్టి రాజకీయాలా?**

పదవుల కోసమే ఈ వివాదం నడుస్తోందా లేదా దీని వెనుక కొందరు మాజీ కీలక అధికారులు తెరవెనుక చక్రం తిప్పుతున్నారా అనేది యూనివర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చగా మారింది. కొన్ని వర్గాలు ఫ్యాకల్టీ సభ్యులే ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తుండగా, విద్యా సంస్థ పరిపాలనలో బయటి వ్యక్తుల జోక్యం ఎక్కువైందని అనుకూల వర్గాలు భావిస్తున్నాయి. కానీ, అసలు పాఠాలు చెప్పాల్సిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విధులను పక్కనపెట్టి ర్యాలీల్లో పాల్గొనడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పట్టించుకోని వీసీ, ఇప్పుడు తన స్వార్థం కోసం ఇలా ర్యాలీలు నిర్వహించుకోవడం ఆశ్చర్యకరంగా ఉందంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

**దిగజారుతున్న ప్రతిష్ట.. ఎవరిది ఈ ఎజెండా.?**

రాష్ట్రంలోనే అత్యున్నత సాంకేతిక విశ్వవిద్యాలయంగా పేరుగాంచిన జేఎన్‌టీయూహెచ్ ప్రతిష్టను కొంతమంది తమ వ్యక్తిగత వైరి, పదవుల పోరాటం కోసం దిగజారుస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లో విద్యా వాతావరణం దెబ్బతిని, అభిప్రాయాలు రెండు వర్గాలుగా చీలిపోయాయి. విద్యాబోధన, పరిశోధనల కంటే రోజూ ఏదో ఒక వివాదమే వార్తల్లో నిలవడం వర్సిటీ ప్రతిష్టను మసకబారుస్తోంది. అసలు జేఎన్‌టీయూహెచ్ లో అమలవుతున్న ఎజెండా ఎవరిది? విద్యార్థుల భవిష్యత్తును పక్కనపెట్టి పదవుల పండగ చేసుకుంటున్న ఈ వివాదం ముమ్ముందు ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# మెట్రోలో ప్రత్యేక గ్రీన్ కారిడార్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రో రైలు కేవలం నగరవాసులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా వ్యవస్థగానే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలా మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. తీవ్రమైన ట్రాఫిక్ చిక్కులను అధిగమించి, అవయవ మార్పిడి చికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా , వేగంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక 'గ్రీన్ కారిడార్'గా మారింది.

**రాయదుర్గ్ నుంచి రసూల్‌పురా.. 25 నిమిషాల్లో 14 కిలోమీటర్ల ప్రయాణం**

గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె , ఊపిరితిత్తులను సికింద్రాబాద్ పరిధిలోని కిమ్స్ (KIMS) ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ సమస్యల వల్ల సమయం వృథా అయ్యే ప్రమాదం ఉండటంతో వైద్యులు మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హైదరాబాద్ మెట్రో అధికారులు రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేకంగా మెట్రో ట్రాన్సిట్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో ఉన్న 13 స్టేషన్లను దాటుకుంటూ, కేవలం 25 నిమిషాల్లోనే 14 కిలోమీటర్ల దూరాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా చేర్చారు.

**సమన్వయంతో విజయవంతమైన 'లైఫ్ సేవింగ్ మిషన్'**

అవయవ మార్పిడి చికిత్సల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్య బృందాలు , మెట్రో సిబ్బంది పరస్పరం పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ మిషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో అత్యవసర అవయవాల రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సరైన సమయానికి డోనర్ అవయవాలు కిమ్స్ ఆసుపత్రికి చేరడంతో బాధితుడికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.

**రవాణాకే కాదు.. ప్రాణరక్షణలోనూ ముందంజ**

అత్యవసర వైద్య సేవలకు నిరంతరం అండగా నిలుస్తున్న హైదరాబాద్ మెట్రో సేవలకు నగరవాసుల నుంచి, వైద్య వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నిమిషాల విలువను గుర్తించి, కచ్చితమైన ప్రణాళికతో సమయానికి అవయవాలను చేర్చి ఒక ప్రాణాన్ని నిలబెట్టడంలో మెట్రో పోషించిన పాత్ర ప్రశంసనీయం. వేగవంతమైన ప్రయాణానికే కాదు, మానవతా దృక్పథంతో ప్రాణాలు కాపాడటంలోనూ తాను ఎప్పుడూ ముందే ఉంటానని హైదరాబాద్ మెట్రో మరోసారి నిరూపించింది.

# బ్రిడ్జి కిందకు ఒరిగిన స్కూల్ బస్..



**మెదక్,ఫ్లాష్ ఇండియా :** స్కూల్ విద్యార్థులు వెళ్తున్న బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. బ్రిడ్జి పై నుంచి వెళ్తున్న బస్సు ఒక్కసారిగా పక్కకు ఒరగడంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి విద్యార్థులను సురక్షితంగా కిందకు దింపిన ఘటన మెదక్ పట్టణ శివారులోని పుష్పాల వాగు బ్రిడ్జి వద్ద శనివారం జరిగింది. మెదక్ పట్టణంలోని డాన్ బాస్కో స్కూల్ విద్యార్థులు బస్సులో శివ్వాయిపల్లి, గుట్టకిందిపల్లి, మల్కాపూర్ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతినిత్యం స్కూల్ బస్సులో వస్తుంటారు.ఎప్పటిలాగే స్కూల్ కు వచ్చిన విద్యార్థులను బస్సులో తిరిగి తీసుకువెళ్తున్న క్రమంలో పట్టణ శివారులోని పుష్పాల వాగు పై నిర్మించిన బ్రిడ్జి వద్ద గత వర్షాకాలంలో మట్టి కొట్టుకు పోవడం మరమ్మత్తులు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టి మెత్తగా కావడంతో దానిపై వెళ్తున్న బస్సు పక్కకు ఒరిగింది. ప్రమాదాన్ని ముందుగానే గమనించిన డ్రైవర్ అక్కడే బస్సును నిలిపి వేసి అందులో ఉన్న విద్యార్థులను కిందకు దింపేశారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెను ప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాల వద్ద తెగిపోయిన బ్రిడ్జి పై మరమత్తులు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బస్సులో సుమారు 50 కి పైగా విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# స్వర్ణాంధ్ర విజన్కు కీలకమైన రోజు

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో ఇది అత్యంత కీలకమైన రోజని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలుగులో అందరికీ నమస్కారం చెబుతూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోడీ, సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి నమస్కారాలు తెలియజేసి, పవిత్రమైన ఉత్తరాంధ్ర నేలపై అడుగుపెట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేసినట్లు ప్రధాని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను మరింత వేగంగా అభివృద్ధి దిశగా తీసుకెళ్తాయని చెప్పారు. భోగాపురం సభలో ఒకేసారి 13 వేల మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ ధిమ్సా నృత్యం తనను ఎంతో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెండు రికార్డులు నమోదయ్యాయని, ఒకటి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కాగా, మరొకటి వేలాది మంది పాల్గొన్న ధిమ్సా నృత్య ప్రదర్శన అని అన్నారు. అల్లూరి సీతారామరాజు గిరిజన హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని గుర్తు చేసిన ప్రధాని మోడీ, ఆయన పేరును భోగాపురం విమానాశ్రయానికి పెట్టడం గర్వకారణమని తెలిపారు. గతంలో విమానాశ్రయాలకు ఒకే కుటుంబానికి చెందిన పేర్లు పెట్టే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశ గర్వకారణమైన మహనీయుల పేర్లను విమానాశ్రయాలకు పెడుతున్నామని చెప్పారు. అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు, భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ విమానయాన రంగంలో గత దశాబ్దంలో జరిగిన మార్పులను వివరిస్తూ, 2014కు ముందు దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం వాటి సంఖ్య 166కు చేరిందని మోదీ వెల్లడించారు. ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలను కూడా విమాన సేవలతో అనుసంధానం చేసి, పేద, మధ్యతరగతి ప్రజలకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, రైల్వేలు, జాతీయ రహదారులు, పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోందని ప్రధాని వివరించారు. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న పోర్టుల అభివృద్ధితో పాటు మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలవుతున్నాయని, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఫార్మా రంగాల్లో కొత్త పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. తెలుగు ప్రజలు ప్రతిభావంతులని, ప్రపంచవ్యాప్తంగా తమ సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారని కొనియాడిన ప్రధాని మోడీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ తయారీ రంగానికి కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా జరుగుతోందని పేర్కొంటూ, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి, పెట్టుబడులు, అభివృద్ధికి కొత్త లాంచ్‌ప్యాడ్‌గా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు ప్రధాని నరేంద్ర మోడీ..

## మంత్రి వివేక్ పై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు

**రామకృష్ణాపూర్,ఫ్లాష్ ఇండియా :** మంచిర్యాల జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన నేపథ్యంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న జాతీయ రహదారి--363 సర్వీస్ రోడ్డును, కల్వర్టును పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా మంత్రి వివేక్ పర్యటనలోని వీడియోలు, ఫోటోలను వక్రీకరించి సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా దుష్ప్రచారం చేయడం నిజంగా సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే పరిష్కారం చూపాల్సిన ప్రతిపక్షం, సమస్యను వదిలేసి మంత్రి వివేక్ మాటలను వక్రీకరించడం అలవాటుగా మార్చుకుందని అన్నారు. సంఘటన స్థలంలో ఫోటోగ్రాఫర్‌కు సమస్య తీవ్రతను వివరిస్తూ, దెబ్బతిన్న ప్రాంతం స్పష్టంగా కనిపించేలా ఫోటోలు తీసి ఎంపీ వంశీకృష్ణకు పంపిస్తే, కేంద్ర రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పనులు మంజూరు చేయించాలనే ఉద్దేశంతో మాత్రమే సూచనలు చేశారని తెలిపారు. ఈ మాటలను పూర్తిగా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు. భరత్‌నగర్--దుబ్బపల్లి సర్వీస్ రోడ్డుపై కుర్మపల్లి చెరువు అవుట్‌ఫ్లో కాలువ కారణంగా ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని, గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని, ఈసారి భారీ వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతిన్నదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి గడ్డం వివేక్ నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మొట్టే సుధాకర్, మాజీ జెడ్పీటీసీ యాకూబ్ అలీ, పట్టణ మాజీ అధ్యక్షుడు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ పోలం సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ, కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొన్నారు.



## గోదావరి వరదపై అప్రమత్తం..

**మంగపేట,ఫ్లాష్ ఇండియా :** బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆరా.రాష్ట పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి మంగపేట లో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందున, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులను పరామర్శించిన మంత్రి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి ,తహసిల్దార్ తోట రవీందర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల గదులు ప్రారంభం



**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** మియాపూర్ న్యూ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ రూ.22 లక్షల సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. మియాపూర్ 10 ఎకరాలలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియన్ పాఠశాలకు ఇటీవలే శంకుస్థాపన చేశారని తెలిపారు. కొండాపూర్, చందానగర్ లో కోర్ అర్బన్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు కిరణ్, ఉషారాణి, భార్గవి, పవన్, తేజ్ కుమార్, నిర్మల, హరి చైతన్య, మంజుల, శ్రీకాంత్, పాల్గొన్నారు.

# మోడీపై కేటీఆర్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో యువతరం కదం తొక్కిందని, మునుపెన్నడూ లేని విధమైన కొత్త తరహాలో జెన్ జీ యువత ఢిల్లీ వీధుల్లో చెపట్టిన ఆందోళన దెబ్బకు ప్రధాని నరేంద్ర మోడీ అర్ధరాత్రి వీడియో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నరేంద్ర మోడీ ఎవరితో పెట్టుకోకూడదో ఆ పిల్లలతోనే పెట్టుకున్నారని, యువతం కదం తొక్కితే ప్రభుత్వానికే కాదు మోడీ మీడియాకు కూడా బల్బులు ఎగిరిపోయాయన్నారు. ఢిల్లీలో జరిగిన పోరాటం వాట్సాప్ అంకుల్స్ కు, ఇన్ స్టాగ్రామ్ పిల్లలకు మధ్య జరిగిందని ఈ పోరాటంలో ఎవరుగెలిచారో దేశమంతా చూసిందన్నారు. జెన్ జీ పిల్లలు సీబీఐ, ఈడీకి భయపడేరకం కాదన్నారు. ఇవాళ ఓ తెలుగు దినపత్రిక వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు.

**నాన్ బయోలాజికల్ మెదలు వంచారు:**

యువతరాన్ని చూసి దేశంమీద పట్టింపు లేదని మా వయసు వారు అనుకుంటున్నాం. కానీ అది నిజం కాదని వారికి మాకంటే ఎక్కువ నమ్మకం, దేశంపట్ల మాకంటే ఎక్కువ ప్రేమ ఉందని మొన్నటి ఢిల్లీ ఉద్యమంతో తేలిపోయిందన్నారు. కాక్రోచ్ ఉద్యమాన్ని మీడియా పట్టించుకోలేదు. చివరకు నాన్ బయోలాజికల్ అని చెప్పుకునే వారి మెదలు వంచారంటే అది మామూలు విషయం కాదన్నారు. ఇది ప్రధాన ప్రతిపక్షాలుగా మేము చేయలని పనిని ఈ దేశ యువత చేసి చూపి మాకు ఓ దారి చూయించారని చెప్పారు. ట్రెడిషనల్, మెయిన్ స్ట్రీమ్ మీడియాను ప్రభుత్వాలు మేనేజ్ చేశారన్నారు.

**సోషల్ మీడియా లేకపోతే చలనమెక్కడిది?:**

సోషల్ మీడియాకు హద్దులు ఉండాలని కొంత మంది మాట్లాడుతున్నారు. కానీ ఈ పరిమితులు నియమించేది ప్రభుత్వాలా? స్వేచ్ఛకు హద్దులు పెడితే అది వాక్ స్వాతంత్రం ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్వేచ్ఛ అంటే బూతులతో మాట్లాడం కాదని సోషల్ మీడియా లేకపోతే ప్రభుత్వాలలో చలనం వచ్చేది కాదన్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో మన సీఎం మాట్లాడితే అదే కార్యక్రమంలో ఉన్న నేను మన సీఎంమాటను సమర్థిస్తూ మాట్లాడాను. కానీ రేవంత్ రెడ్డి మాత్రం మా రక్తం కావాలంటూ మాట్లాడుతున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. మా భాష కాదు రేవంత్ రెడ్డి భాషని అదుపులో పెట్టుకోమని చెప్పాలని ఇదే కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు.

మీడియాను మేనేజ్ చేయడం ద్వారా ప్రజల్లో నెరెటివ్ డ్రైవ్ చేయవచ్చని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ప్రశాంత్ కిశోర్ లాంటి వారు ఇదే తెబుతున్నారు. కానీ ఢిల్లీలోజరిగిన ఆందోళనలు సంప్రదాయ మూసపద్ధతుల ఆలోచలకు భిన్నంగా యువతరం కందం తొక్కిందన్నారు.

# ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గోదావరి నదిపై నిర్మితమైన వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జూలై 28న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు.

**మెజారిటీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి**

కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో మెజారిటీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టుకు దివంగత శ్రీపాదరావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ అప్పటి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల వల్ల సాధ్యపడలేదన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు. ఇటీవల జరిగిన సాంకేతిక సమావేశంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్‌డీఎస్‌ఏ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారని పేర్కొన్నారు.

**గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం**

డీపీఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిపారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయి**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయని, రైతులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోందన్నారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డీఎస్‌ఏ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడినవేనని పేర్కొన్నారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయని అన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశమున్నప్పటికీ భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపాయల విద్యుత్ వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొందించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు , మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం




# దేశ భవిష్యత్తుకు పెను సవాలు

దేశ భవిష్యత్తు గురించి మాట్లాడిన ప్రతిసారి యువత ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది. ఎందుకంటే యువతే ఒక దేశానికి శక్తి, సృజనాత్మకత, ఆవిష్కరణ, అభివృద్ధికి ప్రతీక. నేటి యువత చేతుల్లోనే రేపటి సమాజం రూపుదిద్దుకుంటుంది. అయితే ఇటీవలి కాలంలో యువతలో మద్యం, గంజాయి, డ్రగ్స్, పొగాకు వంటి మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత అలవాటు కాదు; కుటుంబ వ్యవస్థను, విద్యా రంగాన్ని, సామాజిక విలువలను, దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రమాదకర సామాజిక సమస్యగా మారుతోంది. ఒక దేశం తన యువశక్తిని కోల్పోతే అభివృద్ధి ఎంత వేగంగా జరిగినా దానికి స్థిరత్వం ఉండదు. అందుకే మత్తు పదార్థాల నియంత్రణను ప్రజారోగ్య సమస్యగా మాత్రమే కాకుండా జాతీయ బాధ్యతగా చూడాల్సిన అవసరం ఏర్పడింది.గత కొన్నేళ్లుగా మత్తు పదార్థాల వినియోగంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు నగరాలకే పరిమితమని భావించిన డ్రగ్స్ నేడు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వరకూ విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత, ఒత్తిడికి గురవుతున్న వయోపరిమితి గల యువకులు ఈ వ్యసనాలకు సులభంగా బలవుతున్నారు. స్నేహితుల ఒత్తిడి, ఆసక్తి, సరదా, ఫ్యాషన్, సోషల్ మీడియా ప్రభావం, సినిమా సంస్కృతి వంటి అనేక కారణాలు మొదటిసారి మత్తు పదార్థాలను ప్రయత్నించే పరిస్థితిని కల్పిస్తున్నాయి. “ఒక్కసారి మాత్రమే” అనే ఆలోచనతో మొదలైన అలవాటు క్రమంగా జీవితాన్ని పూర్తిగా కబళించే వ్యసనంగా మారుతోంది.మత్తు పదార్థాల ప్రభావం మనిషి శరీరంపైనే కాదు, అతని ఆలోచనా విధానం, వ్యక్తిత్వం, నిర్ణయ సామర్థ్యంపైనా తీవ్రంగా పడుతుంది. మెదడు పనితీరు మందగించడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆందోళన, నిరాశ, కోపం, మానసిక అస్థిరత వంటి సమస్యలు క్రమంగా పెరుగుతాయి. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి ముఖ్యమైన అవయవాలు కూడా దీర్ఘకాలిక నష్టానికి గురవుతాయి. కొన్నిసార్లు అధిక మోతాదులో మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతక పరిస్థితులకు కూడా దారి తీస్తుంది. ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వయసులోనే అనారోగ్యానికి బానిస కావడం వ్యక్తిగత విషాదమే కాదు, దేశానికి కూడా నష్టం.విద్యార్థి జీవితంపై మత్తు పదార్థాల ప్రభావం మరింత తీవ్రమైనది. చదువుపై ఆసక్తి తగ్గిపోవడం, తరగతులకు దూరమవడం, పరీక్షల్లో విఫలమవడం, విద్యను మధ్యలోనే వదిలేయడం వంటి పరిణామాలు తరచూ కనిపిస్తున్నాయి. విద్య పూర్తికాకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన దశలో వ్యసనాలకు బానిస కావడం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది. వ్యక్తిగత వైఫల్యం చివరికి కుటుంబంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుంది.వ్యసనానికి బానిసైన వ్యక్తి వల్ల కుటుంబాల్లో ఆర్థిక, మానసిక సమస్యలు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల మధ్య కలహాలు, నమ్మకం కోల్పోవడం, అప్పులు, ఆస్తుల విక్రయం, గృహహింస వంటి సమస్యలు తలెత్తుతాయి. కొంతమంది యువకులు మత్తు కోసం డబ్బు సమకూర్చుకునేందుకు దొంగతనాలు, చోరీలు, గొడవలు, ఇతర నేరాలకు పాల్పడే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఫలితంగా ఒక వ్యక్తి చేసిన తప్పు మొత్తం కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయే పరిస్థితిని సృష్టిస్తోంది.ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల లభ్యత పెరుగుతుండటం అత్యంత ప్రమాదకర సంకేతం. పాఠశాలలు, కళాశాలలు విద్యకు, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా ఉండాలి. కానీ కొన్నిచోట్ల మత్తు పదార్థాల అక్రమ రవాణా విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. ఇది కేవలం చట్టపరమైన సమస్య మాత్రమే కాదు; విద్యా వ్యవస్థ భద్రతకు సంబంధించిన అంశం కూడా. విద్యాసంస్థలను పూర్తిగా డ్రగ్స్ రహిత ప్రాంతాలుగా మార్చేందుకు ప్రభుత్వం, విద్యాసంస్థల యాజమాన్యాలు, పోలీసులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.మత్తు వ్యసనాన్ని అరికట్టడంలో కుటుంబం పాత్ర అత్యంత కీలకం. పిల్లల ప్రవర్తనలో వచ్చే చిన్నచిన్న మార్పులను కూడా తల్లిదండ్రులు గమనించాలి. వారితో ప్రతిరోజూ మాట్లాడటం, వారి స్నేహితుల గురించి తెలుసుకోవడం, మానసిక ఒత్తిడిని అర్థం చేసుకోవడం, ప్రేమతో మార్గనిర్దేశం చేయడం అవసరం. కేవలం మందలించడం లేదా శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదు. పిల్లలకు నమ్మకాన్ని కల్పిస్తూ సమస్యలను పంచుకునే వాతావరణాన్ని కుటుంబంలో ఏర్పరచాలి.ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల జీవితంలో కీలక పాత్ర పోషిస్తారు. విద్యతో పాటు జీవన విలువలు, ఆరోగ్యకరమైన అలవాట్లు, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం అవసరం. ప్రతి విద్యాసంస్థలో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. మానసిక ఒత్తిడితో బాధపడుతున్న విద్యార్థులకు సమయానికి సలహాలు, సహాయం అందించగలిగితే వ్యసనాలకు దూరంగా ఉంచడం సాధ్యమవుతుంది.ప్రభుత్వం కూడా ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలి. అక్రమ డ్రగ్స్ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం, సరిహద్దుల వద్ద నిఘాను బలోపేతం చేయడం, విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం అవసరం. అదే సమయంలో శిక్షలతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహించాలి. డ్రగ్స్‌కు బానిసైన వారికి వైద్య చికిత్స, పునరావాస కేంద్రాలు, మానసిక ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలి. వ్యసనాన్ని నేరంగా మాత్రమే కాకుండా ఒక ఆరోగ్య సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.యువత కూడా తమ భవిష్యత్తు తమ చేతుల్లోనే ఉందని గుర్తించాలి. క్రీడలు, యోగా, వ్యాయామం, పుస్తక పఠనం, సంగీతం, కళలు, సామాజిక సేవ వంటి సృజనాత్మక కార్యక్రమాల వైపు ఆసక్తి పెంచుకోవాలి. మంచి స్నేహితులను ఎంచుకోవడం, తప్పుడు ప్రభావాలకు దూరంగా ఉండడం, జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టడం ప్రతి యువకుడి బాధ్యత. క్షణిక ఆనందం కోసం జీవితాన్ని పణంగా పెట్టడం ఎంత ప్రమాదకరమో యువత అర్థం చేసుకోవాలి.దేశ సంపద బంగారం కాదు... చమురు కాదు... యువశక్తి. ఆ యువశక్తి మత్తు పదార్థాల మాయలో చిక్కుకుంటే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. డ్రగ్స్‌పై పోరాటం పోలీసులది మాత్రమే కాదు; కుటుంబాలది, విద్యాసంస్థలది, ప్రభుత్వాలది, సమాజానిదీ కూడా. యువతను శిక్షించడం కంటే వారిని కాపాడడం ముఖ్యం. అవగాహన, ప్రేమ, బాధ్యత, క్రమశిక్షణ, సమిష్టి కృషితోనే ఈ మహమ్మారిని అరికట్టగలం. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన, క్రమశిక్షణ గల యువతే బలమైన భారతదేశానికి పునాది. యువతను మత్తు నుంచి కాపాడటం అంటే దేశ భవిష్యత్తును కాపాడటమే.

# తెలంగాణ ఆత్మకు సజీవ ప్రతీక




పండుగలు కేవలం ఆనందాన్ని పంచే సందర్భాలు కావు. అవి ఒక సమాజం చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాలను, జీవన విధానాన్ని భావితరాలకు అందించే సజీవ వారసత్వం. అలాంటి మహోన్నత సంప్రదాయాల్లో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, హైదరాబాద్ నగర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే ఉత్సవం ఆషాఢ బోనాలు. ఇది మతపరమైన వేడుకను మించి భక్తి, స్త్రీశక్తి, జానపద సంస్కృతి, సామాజిక సమైక్యత, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే ప్రజా మహోత్సవం.

**చరిత్ర నుంచి ప్రపంచ గుర్తింపు వరకు**

1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి విజృంభించిన సమయంలో అమ్మవారికి చేసిన మొక్కుబడే బోనాల ఆరంభమనే చారిత్రక కథనం ప్రచారంలో ఉంది. వ్యాధి నివారణ అనంతరం కృతజ్ఞతగా సమర్పించిన బోనం కాలక్రమేణా కుటుంబ ఆచారం నుంచి సామాజిక ఉత్సవంగా, అక్కడి నుంచి తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా రూపాంతరం చెందింది. నేడు బోనాలు రాష్ట్ర సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సాంస్కృతిక వేడుకగా నిలిచాయి.

**హైదరాబాద్ సంస్కృతికి ప్రతిబింబం**

అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన హైదరాబాద్ తన సాంస్కృతిక మూలాలను సైతం సమానంగా పరిరక్షించుకుంటున్న నగరం. బోనాల సందర్భంగా ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి లాల్‌దర్వాజ, అక్కన్న--మాదన్న ఆలయం, గోల్కొండ ఎల్లమ్మ, బల్కంపేట ఎల్లమ్మ, కట్టమైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల వరకు నగరమంతా భక్తి పారవశ్యంతో కళకళలాడుతుంది. ఆధునికత మధ్య సంప్రదాయం ఎంత సజీవంగా ఉందో ప్రపంచానికి చాటి చెప్పే సందర్భం ఇదే.

**స్త్రీశక్తి, జానపద వైభవానికి ప్రతీక**

బోనాల పండుగలో మహిళల పాత్ర విశిష్టమైనది. తలపై బోనం మోసుకుని అమ్మవారికి సమర్పించే ప్రతి మహిళ తెలంగాణ సంస్కృతిలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. పోతురాజు వీరనృత్యం ధైర్యానికి, రంగం ప్రజల విశ్వాసానికి, ఘటాల ఊరేగింపులు సామూహిక భక్తికి, డప్పుల మోత తెలంగాణ జానపద వైభవానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ సంప్రదాయాలే బోనాలను ప్రపంచంలో ప్రత్యేకమైన ప్రజా సాంస్కృతిక ఉత్సవంగా నిలబెడుతున్నాయి.

**సమైక్యతకు సజీవ నిదర్శనం**

బోనాల విశిష్టత భక్తిలో మాత్రమే కాదు, సమాజాన్ని ఒక్క తాటిపైకి తీసుకురావడంలోనూ ఉంది. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా లక్షలాది మంది ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఇదే హైదరాబాద్ గంగా-జమున తహజీబ్‌కు ప్రతీక. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ బలం అనే సందేశాన్ని బోనాలు ప్రతి ఏడాది మరింత బలంగా చాటిచెబుతాయి.

**సంస్కృతి కూడా అభివృద్ధిలో భాగమే**

బోనాలు కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదు; ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తాయి. చిన్న వ్యాపారులు, పూల వ్యాపారులు, హస్తకళాకారులు, జానపద కళాకారులు, చేతివృత్తిదారులకు ఈ పండుగ ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేయడంతో పాటు పర్యాటక రంగానికీ ప్రోత్సాహాన్ని అందిస్తుంది.ప్రభుత్వ యంత్రాంగం భద్రత, పారిశుధ్యం, ట్రాఫిక్, వైద్య సేవలు, తాగునీరు, విద్యుత్, ప్రజా రవాణా వంటి అంశాల్లో సమన్వయంతో చర్యలు చేపట్టడం ద్వారా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తోంది. ఇలాంటి ఏర్పాట్లు భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే కాకుండా నగర నిర్వహణ సామర్థ్యాన్ని కూడా ప్రతిబింబిస్తాయి.అభివృద్ధి అంటే కేవలం ఆకాశహర్మ్యాలు, విశాల రహదారులు, పెట్టుబడులు మాత్రమే కాదు. ఒక సమాజం తన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఎంతగా కాపాడుకుంటుందన్నది కూడా అభివృద్ధికి ప్రమాణమే. మూలాలను మరచిపోయిన నాగరికత ఎంత వేగంగా ఎదిగినా నిలకడగా నిలవదు. తెలంగాణకు బోనాలు అలాంటి సాంస్కృతిక మూలస్తంభం. ఈ మహోత్సవం భక్తిని మాత్రమే కాదు, సమైక్యతను, స్త్రీశక్తిని, ప్రజా సంస్కృతిని, తెలంగాణ అస్తిత్వాన్ని భావితరాలకు అందించే సజీవ వారసత్వం. ఈ వారసత్వాన్ని పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. బోనాలు నిలిస్తే తెలంగాణ సంస్కృతి నిలుస్తుంది. తెలంగాణ సంస్కృతి నిలిస్తే ఈ నేల ఆత్మ శాశ్వతంగా సజీవంగా ఉంటుంది.

# ద్వేషపూరిత ప్రసంగాలపై చట్టం..




ప్రజాస్వామ్యంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు. అదే సమయంలో ఆ స్వేచ్ఛ పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, సామాజిక వర్గాల మధ్య విభేదాలను పెంచే వ్యాఖ్యలు, హింసను ప్రేరేపించే ప్రచారం ప్రజాస్వామ్యానికే ముప్పుగా మారితే ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ‘తెలంగాణ ద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేషపూరిత నేరాల (నిరోధక) బిల్లు-2026’ రాష్ట్ర రాజకీయ, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఒకవైపు సమాజంలో పెరుగుతున్న విద్వేష రాజకీయాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తుండగా, మరోవైపు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ఈ చట్టం ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధించడమే ఇప్పుడు ప్రధాన సవాలుగా మారింది.గత కొన్నేళ్లుగా సోషల్ మీడియా విస్తరణతో సమాచారం వేగంగా ప్రజల్లోకి చేరుతోంది. అదే సమయంలో తప్పుడు ప్రచారం, మత, కుల, ప్రాంతీయ విద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, ప్రసంగాలు కూడా విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. ఒక్క సోషల్ మీడియా పోస్టు కూడా కొన్ని సందర్భాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులను సృష్టించిన ఉదాహరణలు దేశవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలోనూ, సామాజిక ఉద్రిక్తతల సమయంలోనూ ద్వేషపూరిత ప్రచారం మరింత తీవ్రరూపం దాల్చడం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ఇటువంటి చర్యలను నియంత్రించే చట్టం అవసరమనే అభిప్రాయం బలపడుతోంది.ప్రతిపాదిత బిల్లులో ద్వేషపూరిత నేరాలకు కఠిన శిక్షలు ప్రతిపాదించడం కూడా చర్చనీయాంశంగా మారింది. మొదటిసారి నేరం చేసిన వారికి ఏడాది నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా, తిరిగి అదే నేరానికి పాల్పడితే పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే ప్రతిపాదనలు ఉన్నాయి. చట్టం కఠినంగా ఉంటేనే నేరాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం సమాజంలోని అనేక వర్గాల్లో ఉంది.అయితే ఇక్కడే మరో కీలక ప్రశ్న కూడా తలెత్తుతోంది. విద్వేషపూరిత ప్రసంగం అంటే ఏమిటి? ఒక విమర్శ ఎక్కడ ముగుస్తుంది? విద్వేష ప్రసంగం ఎక్కడ ప్రారంభమవుతుంది? ఈ నిర్వచనం స్పష్టంగా లేకపోతే చట్టం దుర్వినియోగానికి అవకాశం ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ విమర్శలు, ప్రభుత్వ విధానాలపై వ్యతిరేక అభిప్రాయాలు, సామాజిక అంశాలపై ప్రజాస్వామ్య చర్చలను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చే ప్రమాదం ఉందని పలువురు న్యాయ నిపుణులు, పాత్రికేయ సంఘాలు, పౌరసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అందుకే చట్టం ఉద్దేశం ఎంత మంచిదైనా, దాని అమలులో స్పష్టత, పారదర్శకత లేకపోతే సమస్యలు తలెత్తే అవకాశాన్ని విస్మరించలేం.ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టినప్పుడు అన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం గమనార్హం. అనంతరం దీనిని సెలెక్ట్ కమిటీకి పంపడం ప్రజాస్వామ్య ప్రక్రియలో సరైన అడుగుగా చెప్పవచ్చు. వివిధ రాజకీయ పార్టీలు, న్యాయ నిపుణులు, జర్నలిస్టులు, పౌరసంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని చట్టాన్ని మరింత సమగ్రమైన రూపంలో రూపొందించే అవకాశం దీనివల్ల లభిస్తుంది. చట్టాలు ప్రజల కోసం రూపొందించబడతాయి. అందువల్ల ప్రజల సందేహాలకు సమాధానం చెప్పే విధంగా అవి ఉండాలి.ప్రపంచవ్యాప్తంగా కూడా ద్వేషపూరిత ప్రసంగాల నియంత్రణపై చట్టాలు అమలులో ఉన్నాయి. అయితే వాటి అమలులో న్యాయపరమైన ప్రమాణాలు, స్వతంత్ర దర్యాప్తు, న్యాయస్థానాల పర్యవేక్షణ వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు, ప్రశ్నించే హక్కు, విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదు. అదే సమయంలో మత, కుల, జాతి, ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను కూడా నిర్లక్ష్యం చేయలేం. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ఒక మంచి చట్టానికి ప్రమాణం.సోషల్ మీడియా యుగంలో బాధ్యతాయుతమైన సంభాషణ అత్యవసరంగా మారింది. తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారం సమాజంలో విభేదాలను మరింత పెంచుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో చట్టం ఒక్కటే పరిష్కారం కాదు. ప్రజల్లో అవగాహన పెంపు, డిజిటల్ అక్షరాస్యత, బాధ్యతాయుతమైన మీడియా వ్యవహారం, రాజకీయ నాయకుల సంయమనంతో కూడిన వ్యాఖ్యలు కూడా అంతే ముఖ్యమైనవి. చట్టం భయాన్ని సృష్టించకుండా, బాధ్యతను పెంపొందించేలా ఉండాలి.సమాజంలో విద్వేషాన్ని అరికట్టడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కాపాడడం కూడా రాజ్యాంగబద్ధమైన బాధ్యతే. ఈ రెండు విలువల్లో ఏదో ఒకదానికి ప్రాధాన్యం ఇవ్వడం కాకుండా, రెండింటినీ సమానంగా పరిరక్షించే చట్టమే ప్రజాస్వామ్యానికి బలం చేకూరుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ద్వేషపూరిత ప్రసంగాల నిరోధక బిల్లును సెలెక్ట్ కమిటీ అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా పరిశీలించాలి. చట్టం కఠినంగా ఉండటం కంటే న్యాయబద్ధంగా, పారదర్శకంగా, దుర్వినియోగానికి అవకాశం లేకుండా ఉండటం మరింత ముఖ్యం. విద్వేషాన్ని అడ్డుకునే ప్రయత్నంలో స్వేచ్ఛను కట్టడి చేయకూడదు. అలాగే స్వేచ్ఛ పేరుతో విద్వేషానికి అవకాశం ఇవ్వకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించగలిగితేనే ఈ చట్టం తన అసలు లక్ష్యాన్ని నెరవేర్చినట్లవుతుంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ..

## జూరాల ప్రాజెక్ట్ 29 గేట్లు ఎత్తివేత



**జోగులాంబ,ఫ్లాష్ ఇండియా :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జోగులాంబ గద్వాల జిల్లా ప్రియదర్శిని జూరాల (పీజేపీ) ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం ఉదయం 6 గంటల నాటికి ప్రాజెక్టుకు 1,52,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. వరద ఉధృతి నేపథ్యంలో ప్రాజెక్టు 29 స్పిల్‌వే గేట్లను ఎత్తి 1,05,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం 318.01 మీటర్లు (1,043.340 అడుగులు)గా నమోదైంది. డ్యామ్‌లో మొత్తం నీటి నిల్వ 8.631 టీఎంసీలు కాగా, లైవ్ స్టోరేజ్ 4.924 టీఎంసీలుగా ఉంది.విద్యుత్ ఉత్పత్తి కోసం పవర్‌హౌస్ ద్వారా 36,063 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 750 క్యూసెక్కులు, భీమా ఎత్తిపోతల మొదటి దశకు 1,300 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 630 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువకు 845 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 650 క్యూసెక్కులు, ప్యారలల్ కాలువకు 600 క్యూసెక్కులు, భీమా ఎత్తిపోతల రెండో దశకు 872 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.స్పిల్‌వే, పవర్‌హౌస్, కాలువల ద్వారా కలిపి మొత్తం 1,45,884 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో కృష్ణా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి దిగకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ దూకుడు..

- **2025-26లో రూ.4,18,931**
- **దేశంలోనే రెండో స్థానంలో రాష్ట్రం**
- **2024-25తో పోల్చితే 10.23శాతం వృద్ధి**
- **జీఎస్‌డీపీలో ఏడో స్థానంలో తెలంగాణ ఆర్‌బీఐ నివేదికలో వెల్లడి**
- **యూపీ, పంజాబ్, కేరళ మినహా రాష్ట్రాల గణాంకాలు విడుదల**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తలసరి ఆదాయంలో రాష్ట్రం దూసుకెళుతోంది. 2025-26లో రూ.4,18,931 తలసరి ఆదాయంతో దేశంలో రెండో స్థానంలో నిలిచింది. అంతకుముందటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 10.23 శాతం వృద్ధి నమోదు చేసింది. శుక్రవారం యూపీ, పంజాబ్, కేరళ మినహా మిగతా రాష్ట్రాల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం వివరాలతో రిజర్వు బ్యాంకు నివేదిక విడుదల చేసింది. తెలంగాణ జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో వేగంగా పెరుగుదల ఉందని తెలిపింది. 2024-25లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,80,031కాగా, 2025-26లో మరో రూ.38,900 పెరిగింది. 10.23 శాతం వృద్ధిని నమోదు చేసింది 2025-26లో తెలంగాణ జీఎస్‌డీఏ రూ.16,14,771 కోట్లుగా ఉందని, దేశంలో ఏడో స్థానంలో నిలిచిందని ఆర్‌బీఐ వెల్లడించింది. ముందటి ఆర్థిక సంవత్సరం (2024-25) నాటి జీఎస్‌డీఏ రూ.14,67,913 కోట్లతో పోలిస్తే.. ఇది 1,56,858 కోట్లు (10.75శాతం) ఎక్కువని తెలిపింది.

**2025-26లో.. (రూ.లలో) రాష్ట్రం - తలసరి ఆదాయం**

కర్ణాటక - 4,33,326
తెలంగాణ - 4,18,931
తమిళనాడు - 4,08,027
గుజరాత్ - 3,57,531
మహారాష్ట్ర - 3,47,903
ఆంధ్రప్రదేశ్ - 2,94,507

**2025-26లో పెద్ద రాష్ట్రాల జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)**

రాష్ట్రం - జీఎస్‌డీపీ
మహారాష్ట్ర - 44,84,537
తమిళనాడు - 31,60,206
కర్ణాటక - 29,80,634
గుజరాత్ - 26,36,003
పశ్చిమబెంగాల్ - 17,99,664
రాజస్థాన్ - 16,85,118
తెలంగాణ - 16,14,771
ఆంధ్రప్రదేశ్ - 15,79,501
మధ్యప్రదేశ్ - 15,08,655
బీహార్ - 10,03,951

# జెన్ జీ కి సంస్కారం నేర్పించాలి..



**ఆంధ్రప్రదేశ్:** దేశాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న ప్రధాని నరేంద్ర మోడీని అనకూడని మాటలు అంటున్నారని, ఆ మాటలు వింటుంటే నాకు దుఃఖం వేస్తోందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం కష్టపడేవారికి ఇదేనా మనం ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. తిట్టిన వారిని పెద్ద మనసుతో క్షమించిన వ్యక్తి మోడీ అని.. ఇది చూశాక మోడీ పాదాలకు నమస్కారం చేస్తున్నానన్నారు. నేటి యువతకు తల్లిదండ్రులు సరైన సంస్కారం నేర్పించాలన్నారు. ఇవాళ భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన పవన్... దేశాన్ని నడిపించడం అంటే బృహత్కార్యం అని మోడీ చేస్తున్నది అలాంటిదేనన్నారు. దేశాన్ని నడిపించడం అంటే రామకార్యం లాంటిందని సెలవు తీసుకోకుండా పని చేస్తున్న ప్రధానికి మనం ఏం ఇవ్వగలం అన్నారు. పండ్లున్న చెట్లకే రాళ్ల దెబ్బలు అన్నట్లు పని చేస్తున్న మోడీనే విమర్శిస్తున్నారని అన్నారు.

**మీరు వద్దనుకునే వరకు మీకు అధికారం:**

నరేంద్ర మోడీ స్వయంగా తనంతట తానే అధికారం వద్దు అని అనుకుంటే వదలాలి తప్పా అప్పటి వరకు దేశ పరిపాలన పగ్గాలు మీ చేతుల్లోనే ఉండాలని అందుకు మేమంతా కృషి చేస్తామన్నారు. మోడీని మించిన నాయకుడు మరొకరు లేరన్నారు. కూటమి ఏర్పాటు కోసం నేను చాలా తపన పడ్డానని, దేశం కోసం పని చేస్తున్న వ్యక్తికి అండగా నిలబడితే ఏం జరుగుతుందో భోగాపురం ఎయిర్ పోర్టే నిదర్శనం అన్నారు. మోడీ ఈ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారని, దేశాన్ని ప్రగతి పథంలో వేగంగా నడిపిస్తున్న నేత మోడీ అని 140 మంది ప్రజల ఆకాంక్షలను మోడీ సాకారం చేస్తున్నారని చెప్పారు. తెలుగు జాతి ఎవరికీ తలవంచదని అల్లూరి సీతారామరాజు గర్జించారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్ట్ ఏపీ అభివృద్ధిలో సరికొత్త అధ్యాయం అన్నారు.




# సైన్యం సిద్ధం..

**అమెరికా:** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడికి సిద్ధవ-ువుతున్నట్లు తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వైఖరి మారకపోతే ఈ వారాంతంలోనే ఆ దేశంపై భారీ స్థాయిలో ప్రతీకార దాడులు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్ దాడులను, చర్యలను తీవ్రతరం చేస్తే.. ఇంతకుముందు ఎన్నడూ చూడని రీతిలో అమెరికా బలగాలు ప్రతీకారం తీర్చుకుంటాయని ట్రంప్ హెచ్చరించారు.

**యుద్ధసన్నద్ధత..**

అమెరికా వైమానిక దళాలు, యుద్ధ నౌకలు ఇప్పటికే రంగంలోకి దిగాయని, దాడులకు సంబంధించిన తుది ఆదేశాల కోసం సర్వసన్నద్ధంగా ఉన్నాయని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ కొత్త నాయకత్వం (మొజబా ఖమేనీ), అమెరికా- ఇజ్రాయెల్ కూటమి మధ్య నెలకొన్న వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరుపక్షాలు రాజీ పడకపోవడంతో ప్రాంతీయ శాంతికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. అమెరికా సైనిక వర్గాల నుంచి ఏ క్షణంలోనైనా వైమానిక దాడుల ప్రకటన రావచ్చనే వార్తలతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



# రైతన్నలకు చేదు వార్త..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రుతుపవనాల రెండో విడత (ఆగస్టు-సెప్టెంబర్ 2026) అంచనాలను విడుదల చేసింది. రైతన్నలకు ఇది ఓ చేదు వార్త కానుంది. ఎందుకంటే రాబోయే రెండు నెలల్లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఆగస్టు నెలలో దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత తగ్గి, పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. పసిఫిక్ మహా-సముద్రంలో 'ఎల్‌నినో' పరిస్థితులు మరింత బలపడటమే ఇందుకు ప్రధాన కారణమని ఐఎండీ స్పష్టం చేసింది. ఈ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపైనా గణనీయంగా పడనుంది. ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో తెలంగాణలో సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే, ఉత్తర, పశ్చిమ, దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే, ఒక్క ఆగస్టు నెల వరకు చూస్తే ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో సాధారణం నుంచి సాధారణం కంటే కాస్త ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉండగా, పశ్చిమ, దక్షిణ తెలంగాణలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్ష-పాతమే నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. వర్షాలు తగ్గడంతో పాటు ఆగస్టు నెల అంతటా తెలంగాణవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. పగటి వేడితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉండి, రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉక్కపోత, వేడి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# పరిశ్రమల నష్టమెంత?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో తరచూ జరుగుతున్న ఎన్నికల వల్ల వ్యాపారాలు, పరిశ్రమలపై పడుతున్న ఆర్థిక నష్టంపై ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' పై ఏర్పడిన ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ దృష్టి సారించింది. వివిధ రాష్ట్రాల్లో తరచూ ఎన్నికలు జరగడం వల్ల అది ఆయా ప్రా-జెక్టులు, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేకులు పడుతోందనే అభిప్రాయాలు చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తరచుగా జరిగే ఎన్నికల వల్ల వ్యాపార కార్యకలాపాలు, కార్మికుల లభ్యత, పెట్టుబడి నిర్ణయాలు, ప్రభుత్వ అనుమతులపై పడే ప్రభావాన్ని లెక్కించాలని పరిశ్రమలను తాజాగా కోరింది .

**సీఐఐ సర్వే.. వివరాల సేకరణ:**

ఈ మేరకు 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' వంటి పారిశ్రామిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉన్న తమ సభ్య కంపెనీలకు ప్రత్యేక సర్వే ఫారమ్‌లను పంపాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల ప్రభుత్వ అనుమతులు, టెండర్ల రద్దు లేదా వాయిదా, భూసేకరణ, పర్యావరణ అనువ-ంతులు, ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల్లో జరిగే ఆలస్యం వల్ల పరిశ్రమలు ఎదుర్కొంటున్న నష్టాలను ఈ సర్వే ద్వారా సేకరిస్తున్నారు. ప్రాజెక్ట్ వ్యయం పెరగడం, కొత్త పెట్టుబడుల నిర్ణయాలు వాయిదా పడటం వంటి అంశాలపై కూడా స్పష్టమైన నివేదికలను కోరుతున్నారు. ఈ మేరకు గతంలో జరిగిన లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వ్యాపార కార్యకలాపాలకు ఎంతమేర విఘాతం కలిగింది? ఎంత మొత్తం నష్టం వాటిల్లింది? అనే వివరాలను అంచనా వేసి పంపాలని జేపీసీ కోరింది. దేశవ్యాప్తంగా జమిలి (ఒకేసారి) ఎన్నికలు నిర్వహిస్తే ప్రా-జెక్టుల నిర్వహణలో ఎంత శాతం పురోగతి ఉంటుంది? వ్యాపార సమర్థత ఎంత పెరుగుతుంది? దాని ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను కూడా సమర్పించాలని జేపీసీ కంపెనీలను కోరింది.

**ఉద్యోగుల సెలవులు, ఇతర రంగాల నష్టం!**

ఇక ఎన్నికల సమయంలో ఓటింగ్ నిమిత్తం ఉద్యోగుల విధులకు హాజరుకాకపోవడం, ప్రయాణ పరిమితులు, భద్రతా ఆంక్షల వల్ల కోల్పోయిన పనిదినాలు, ఉత్పాదకత నష్టాన్ని కంపెనీలు సేకరిస్తున్నాయి. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు సమయంలో మద్యం విక్రయాల నిషేధించడం వల్ల హోటళ్లు, పర్యాటక రంగానికి వస్తున్న రాబడి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఇక ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లోకి తీసుకోవడం, పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించడం వల్ల విద్యాబోధనకు కలిగే ఆటంకాలను కూడా సర్వేలో సేకరిస్తున్నారు.

# నర్మాలకు మళ్లీ జీవం!



**దుబ్బాక(సిద్దిపేట),ఫ్లాష్ ఇండియా :** మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల తో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు (నర్మాల) ప్రాజెక్టుకు మళ్లీ జీవం వస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి పాల్వంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుండగా, సరిహద్దు జిల్లాల రైతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మా ల ప్రాజెక్టు వర్షాల కారణంగా మళ్లీ జీవం పోసుకుంటోంది. ఈ పరిణామం జిల్లా దుబ్బాకతో పాటు సరిహద్దు జిల్లాల రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ప్రాజెక్టుకు ప్రధాన జలవనరు అయిన కామారెడ్డి జిల్లాలో పాల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరద నీటిని నర్మాలకు చేర్చుతోంది. మ-రోవైపు దుబ్బాక నియోజకవర్గానికి జీవనాధారమైన కూడవెల్లి వాగులోనూ ప్రవాహం మొదలైంది.

**పాల్వంచ ఉధృతి.. పెరుగుతున్న ఇన్‌ఫ్లో**

ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాల్వంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నాటికి ప్రాజెక్టులోకి 2,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతానికి ప్రాజెక్టు నుంచి ఎలాంటి నీటిని విడుదల చేయలేదు. స్పిల్‌వేతో పాటు కుడి, ఎడమ ప్రధాన కాలువలు మూసివేసి ఉన్నాయి.

**ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం**

శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమ-యానికి ఎగువ మానేరు ప్రాజెక్టు నీటిమట్టం 1472.67అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1482.50 అడుగులు కాగా, ప్రస్తుతం 0.912 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రా-జెక్టులో 1473.80 అడుగుల నీటిమట్టంతో 1.01 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది.

**నెమ్మదిగా కూడవెల్లి ప్రవాహం**

దుబ్బాక ప్రాంతానికి జీవనాడిగా భావించే కూడవెల్లి వాగు, ఈ ఏడాది మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల సక్రమంగా లేకపోవడంతో ఎండిపోయింది. కురుస్తున్న వర్షాలకు వాగులో స్వల్పంగా ప్రవా హం మొదలైంది. రామలింగేశ్వరాలయ సన్నిధి వరకు నీరు చేరింది. శుక్రవారం సాయంత్రం మళ్లీ వర్షం ప్రారంభం కావడంతో, శనివారానికి వాగు మరింత ఉధృతిని సంతరించుకునే అవకాశముంది. ఈ వాగు పూర్తిగా ప్రవహిస్తే దీనిపై ఉన్న 54 చెక్‌డ్యాంలు నిండి పరివాహక రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుంది.

**పెరుగనున్న భూగర్భ జలాలు**

ఎగువ మానేరు ప్రాజెక్టు నీటిమట్టం పెరిగితే దుబ్బాక మండలంతో పాటు కామారెడ్డి జిల్లా బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని రైతులు భావిస్తున్నారు. ముఖ్యంగా దుబ్బాకతో పాటు చెల్లాపూర్, రాజక్కపేట, అప్పనపల్లి గ్రామాల వరకు నర్మాల ప్రాజెక్టు ఊట నీటి ప్రభావంతో బోరుబావుల్లో నీటి మట్టాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తవ-ువుతోంది.

**ఆకాశం వైపే రైతుల చూపు**

దుబ్బాక నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో చెరువుల్లోకి నీరు చేరలేదు. చెర-ువులను పూర్తిస్థాయిలో మల్లన్నసాగర్ ప్రా-జెక్టుకు అనుసంధానం చేయకపోవడంతోనే ఈ నీటి ఎద్దడి తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురువానలతో పాటు భారీ వర్షాలు నమోదైతేనే తడిసిన నేల నుంచి వరద నీరు నేరుగా చెరువుల్లోకి చేరే అవకాశం ఉంది. రానున్న రెండు రోజుల వర్షాలపైనే ఎగువ మానేరు నీటిమట్టం, భూగర్భ జలాల పెరుగుదల ఆధారపడి ఉంది.

# కేరళలో కేటుగాడి అరెస్ట్..




**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన రూ.52 కోట్ల భారీ పెట్టుబడి మోసం కేసును పోలీసులు ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ శనివారం వివరాలు వెల్లడించారు. ఫిర్యాదుదారుడు భార్వాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువు-రు బాధితుల నుంచి సుమారు రూ.52 కోట్ల పెట్టుబడులను మోసపూరితంగా సేకరించినట్లు విచారణలో తేలింది.బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ మోసాలకు పాల్పడినట్లు వెల్లడించారు. సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకొచ్చి విచారించారు. విచారణలో భాగంగా 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మూడు అంతస్తుల భవనం, ఒక ఫ్లాట్ కొనుగోలు చేసినట్లు కూడా పోలీసులు గుర్తించారు. కేసుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు, పత్రాల పరిశీలన కొనసాగుతోందని, మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీయడం కోసం దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. అధిక లాభాల పేరుతో ఆకర్షించే పెట్టుబడి పథకాలను గుడ్డిగా నమ్మవద్దని ప్రజలకు సూచించిన పోలీసులు, అనుమానాస్పద పెట్టుబడి సంస్థలు లేదా వ్యక్తులపై సమాచారం తెలిసినా, మోసానికి గురైన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసులు, జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

## చోరీలను అరికట్టేందుకు

# వ్యవసాయ మోటార్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు




**అడవిదేవులపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అడవిదేవులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల వద్ద జరుగుతున్న కేబుల్ వైర్ల చోరీలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు.ఈ సందర్భంగా అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ మోటార్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలను నివారించవచ్చని తెలిపారు.గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.రైతుల ఆస్తుల రక్షణతో పాటు చోరీలను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

# జిల్లాకు విచ్చేసిన హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శనివారం, హైకోర్టు, అడ్మినిస్ట్రేషన్, జనగామ జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి సురేపల్లి నందా జిల్లాకు విచ్చేశారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు నిర్వహించిన గౌరవ వందనాన్ని హైకోర్టు జడ్జి స్వీకరించారు.ఈ నేపథ్యంలో... పోలీసు కమిషనర్ (సీపీ) శ్వేత, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ మర్యాదపూర్వకంగా హైకోర్టు జడ్జిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సిరిపురం జెడ్పీహెచ్ఎస్ లో న్యాయవిజ్ఞాన సదస్సు





**రామన్నపేట,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్ నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శిరీష ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై వారికి న్యాయ అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులు, బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోక్సో చట్టం, మంచి స్పర్శ-చెడు స్పర్శ, మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, ఉచిత న్యాయ సహాయం, న్యాయాన్ని పొందే హక్కు, సైబర్ భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. అదేవిధంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సుక్క శ్రవణ్ కుమార్ కూడా పై అంశాలపై విద్యార్థులకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ, వారి హక్కులు, బాధ్యతలు, చట్టాలను గౌరవించే విధానం, సైబర్ నేరాల నుండి రక్షణ, బాలల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విపులంగా వివరించారు. సందేహాలు అడిగిన విద్యార్థులకు సమాధానాలు ఇచ్చి, చట్టాలపై ఆసక్తి పెంపొందేలా ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం అనంతరం న్యాయమూర్తి శిరీష విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నించి, సరైన సమాధానాలు చెప్పిన వారికి ప్రోత్సాహకంగా పెన్నులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చే

శారు. విద్యార్థుల్లో న్యాయ అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.

# కోనేరులో పడి వ్యక్తి మృతి..



**మెట్ పల్లి,ఫ్లాష్ ఇండియా :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఎదుట ఉన్న కోనేరులో ప్రమాదవశాత్తు కాలు జారి పడి ఓ వ్యక్తి మరణించిన ఘటన చోటు చేసుకుంది. మెట్ పల్లి ఎస్సై కిరాణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్ పల్లి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన కాంపల్లి పోచయ్య (68)అనే వ్యక్తి శనివారం శ్రీ చెన్నకేశవ ఆలయ ముందున్న గల కోనేరు లో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

# ఆగస్టు 9న మహిషాసుర మర్ధిని అమ్మవారి బోనాలు

**అడవిదేవులపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో ఆగస్టు 9వ తేదీ ఆదివారం నాడు ఆషాఢ మాస బోనాలు పండుగ నిర్వహించబడుతుందని ఆలయ అర్చకులు వెల్లటూరి రామ్మోహన్ తెలిపారు. అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ ఈ యొక్క పండుగలో పాల్గొని అమ్మవార్లకు బోనాలను సమర్పించి అమ్మవార్ల అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆయన కోరారు.

# పాశం లక్ష్మారెడ్డి చేసిన సేవలు మరువలేనివి



**హిమాయత్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** పాశం లక్ష్మారెడ్డి చేసిన సేవలు మరువలేనివని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి పాశం లక్ష్మారెడ్డి పదవీ విరమణ సభ తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి పాల్గొని పాశం లక్ష్మారెడ్డి, పద్మ దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేవాలయం అనేది పవిత్రమైన స్థలమని, దేవాలయాలను సమర్థవంతంగా నిర్వహించి అనేక మంచి సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కృష్ణ, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సత్య, చంద్రారెడ్డి, శ్రీనివాసరాజు, పెద్దమ్మగుడి కార్యనిర్వహణాధికారి, సూపరింటెండెంట్లు, దేవాదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



# పాఠశాలలో పాము కలకలం...

**నారాయణపేట,ఫ్లాష్ ఇండియా :** దామరగిద్ద మండలంలోని మల్రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాము ప్రవేశించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. తరగతి గదుల సమీపంలోకి పాము రావడంతో అప్రవంత్తమైన విద్యార్థులు వెంటనే బయటకు పరుగులు తీశారు. విద్యార్థులు ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు, స్థానిక సర్పంచ్ శ్వేతా శివకుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పాఠశాలకు చేరుకున్నారు. స్నేక్ స్టిక్స్ సహాయంతో పామును జాగ్రత్తగా పట్టుకుని సంచిలోకి తీసుకున్నారు. అనంతరం దానిని సమీప అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. దీంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించి పామును పట్టుకున్న గ్రామపంచాయతీ సిబ్బంది బాబు, ఇమ్రాన్, సాయిలుతో పాటు ఉపాధ్యాయులను సర్పంచ్ శ్వేతా శివకుమార్ అభినందించారు. విద్యార్థుల భద్రత విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శనివారం, జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న జరుపుకొనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ లో చేపట్టనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల తరపున స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యా శాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, స్టేజ్ అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలను, బ్యారికేడ్ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో రవి కిరణ్, సిపిఓ చినకోట్యా నాయక్, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ ఎస్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా చలిమల్ల వెంకటరత్నం నియామకం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలగాణ రాష్ట్ర నల్గొండ జిల్లా డిస్టిక్ కాంగ్రెస్ కమిటీ(డిసిసి)ఎస్సీ విభాగం వైస్ ప్రసిడెంట్ గా నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన చలిమల్ల వెంకటరత్నం ను నియమిస్తూ నల్గొండ డిస్టిక్ కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ ఛైర్మెన్ బోడస్వామీ ఉత్తర్వులు జారీ చేసారు.ఈ నియామక పత్రానీ మిర్యాలగూడ శాసన సబ్యూలు బత్తుల లక్ష్మరెడ్డి చేతుల మీదగా చలిమల్ల వెంకటరత్నం అందుకున్నారు.ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లాస్థాయి బాధ్యత అప్పగించిన పార్టి నాయకత్వానికి మరియు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పని చేస్తూ ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారనికి కృషి చేస్థానాని తెలిపారు.కార్యక్రమంలో మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండు నరేదర్ మరియు అవంతిపురం గ్రామా సర్పంచి వల్దాస్ సుజాత సురేష్,రాయినిపాలెం సర్పంచి మురళి,మొలకల కాల్వ సర్పంచి జోషగౌడు,దాసరి కుమార్,చలిమళ్ళ లక్ష్మయ్య,హరిబాబు,బంగారి,మహేష్,కోటేశ్,యడవల్లి అంజయ్య,వీరు,అజయ్ శ్రీను,సైదులు పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ ఎఫ్ సీఎల్ లో 75,391 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి



**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) జూలై--2026 నెలకు సంబంధించిన యూరియా ఉత్పత్తి, పంపిణీ వివరాలను శనివారం విడుదల చేసింది. జూలై నెలలో ప్లాంట్‌లో 75,391 మెట్రిక్ టన్నుల వేపపూత (నీమ్ కోటెడ్) యూరియా ఉత్పత్తి చేయగా, 74,858.58 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు యాజమాన్యం శనివారం వెల్లడించింది. రాష్ట్రాల వారీగా పంపిణీ చేసిన యూరియాలో తెలంగాణకు 31,159.44, కర్ణాటకకు 24,488.55, తమిళనాడుకు 13,557.96, ఆంధ్రప్రదేశ్‌కు 5,652.63 మెట్రిక్ టన్నులు కేటాయించారు. 2026 ఏప్రిల్ నుంచి జూలై వరకు మొత్తం 3,78,143 మెట్రిక్ టన్నుల యూరియాను ఆర్ఎఫ్సీఎల్ పంపిణీ చేయగా, అందులో 2,07,294.12 మెట్రిక్ టన్నులు తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేసినట్లు సంస్థ తెలిపింది. ఆర్ఎఫ్సీఎల్ అనేది నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్), ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్సీఐఎల్) సంయుక్త భాగస్వామ్య సంస్థ. ఇందులో ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్ సంస్థలకు తలా 26 శాతం, ఎఫ్సీఐఎల్‌కు 11 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 11 శాతం ఈక్విటీ వాటా ఉంది. రామగుండం యూనిట్ 2021 మార్చి 22న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రస్తుతం ఇక్కడ తయారవుతున్న నీమ్ కోటెడ్ యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్ & మెయింటెనెన్స్) ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న కేంద్ర రసాయనాలు & ఎరువుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# మంత్రి దామోదర రాజనర్సింహను సత్కరించిన గిరిజన నాయకులు

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో రూ.35.50 కోట్ల వ్యయంతో ట్రైబల్ లా కాలేజీ మంజూరు చేసిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లంబాడాల పోరాట సమితి నాయకులు ప్రకాష్ రాథోడ్, మహేష్ రాథోడ్, మేఘరాజ్ నాయక్ తదితరులు సంగారెడ్డిలో మంత్రిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మిఠాయి తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. చౌటకూర్‌లో ట్రైబల్ లా కాలేజీ ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన విద్యార్థులకు న్యాయ విద్య మరింత చేరువవుతుందని నాయకులు పేర్కొన్నారు.ఉన్నత విద్యతో పాటు న్యాయ రంగంలో గిరిజన యువత రాణించేందుకు ఈ కళాశాల దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిశా కమిటీ సంగారెడ్డి జిల్లా సభ్యుడు ప్రకాష్ రాథోడ్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన న్యాయ విద్యను అందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. కళాశాల మంజూరుకు మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్, ఆందోల్ నియోజకవర్గ నాయకుడు మహేష్ రాథోడ్, మేఘరాజ్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, సర్పంచ్‌లు వినోద్, జైపాల్, సేనాపతి అశోక్, గోపాల్, రాజు, గణేష్ నాయక్, విద్యార్థులు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దేశాన్నే కదిలించింది!

ఒక చిన్న మట్టి ఇల్లు... రోజంతా సైకిళ్లు బాగు చేస్తే వచ్చే మూడు వందల రూపాయలు... అంతే ఆ కుటుంబానికి ప్రపంచం. కానీ ఆ తండ్రి కళ్లలో మాత్రం తన కూతురి కోసం కోట్ల విలువ చేసే ఒక కల ఉండేది. ఆ కల పేరు అస్మితా దే. ఆ తండ్రి కూతురు మెడలో బంగారు పతకం చూడాలని జీవితమంతా పోరాడాడు. కానీ విధి మాత్రం ఆ రోజు వచ్చే వరకు అతన్ని బతకనివ్వలేదు.త్రిపురలోని ఓ చిన్న గ్రామానికి చెందిన అస్మితా దే... కామన్వెల్త్ గేమ్స్ మహిళల 48 కిలోల జూడో విభాగంలో బంగారు పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో జూడోలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన క్రీడాకారిణిగా నిలిచింది. కానీ ఆ విజయాన్ని చెప్పాలని ఆమె ఎక్కువగా కోరుకున్న వ్యక్తి... ఈ లోకంలో లేడు.ఏడు నెలల క్రితం ఆమె తండ్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. రోజుకు కేవలం మూడు వందల రూపాయలు సంపాదించే సైకిల్ మెకానిక్. అయినా తన కూతురి కలలకు ఎప్పుడూ పేదరికం అడ్డుగా నిలవనివ్వలేదు. మోకాలి గాయం వల్ల కెరీర్ ప్రమాదంలో పడినప్పుడు, తన దగ్గర ఉన్నదంతా ఖర్చు చేసి ఢిల్లీకి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. మందులు కొనిపెట్టాడు. తన కూతురు మళ్లీ జూడో మ్యాట్‌పై నిలబడాలని చివరి వరకు పోరాడాడు.కానీ తండ్రి మరణంతో అస్మితా ప్రపంచమే కూలిపోయింది. తనకు అండగా నిలిచిన మనిషి లేకపోవడంతో తన కల కూడా ముగిసిపోయిందని అనుకుంది. అలాంటి సమయంలో తల్లి చెప్పిన ఒక్క మాట ఆమె జీవితాన్ని మళ్లీ నిలబెట్టింది. అంత్యక్రియలు జరిగిన పది రోజులకే... "నిన్ను ఈరోజు ఆపితే నీ నాన్న కలను నేనే చంపినట్టవుతుంది. మళ్లీ ప్రాక్టీస్‌కు వెళ్లు" అని ధైర్యం చెప్పింది.ఆ మాటలతో అస్మితా భోపాల్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రానికి తిరిగి వెళ్లింది. కామన్వెల్త్ గేమ్స్ దగ్గరపడే కొద్దీ ఆందోళన పెరిగింది. ఎన్నో రాత్రులు నిద్రపట్టలేదు. తెల్లవారుజామున ఐదున్నరకే లేచి సాధనకు వెళ్లేది. తమ్ముడు ఎంతో ఇష్టంగా తీసుకొచ్చిన 'లౌంగ్ లట్టా' అనే స్వీట్ ఫ్రిజ్‌లో కనిపించిన ప్రతిసారీ తినాలనిపించినా... లక్ష్యం గుర్తుకొచ్చి తన కోరికను అదుపు చేసుకుంది.చివరకు ఆ త్యాగాలన్నీ ఒక్క బంగారు పతకంగా మారాయి. కామన్వెల్త్ గేమ్స్ వేదికపై స్వర్ణం గెలిచిన ఆ క్షణంలో... భారత జూడో చరిత్ర కొత్త అధ్యాయం ప్రారంభమైంది. కానీ ఆ మెడల్ మెరుపు వెనుక కనిపించని మరో బంగారం ఉంది. అది ఒక పేద తండ్రి నమ్మకం... ఒక తల్లి ధైర్యం... ఒక కూతురు వదులుకోని కల. కొన్నిసార్లు చరిత్రను రాసేది డబ్బు కాదు... తల్లిదండ్రుల త్యాగం, పిల్లల పట్టుదల. అదే అస్మితా దే కథ.



# ఇక నిలబడి ఆడాలి!

టీ20, వన్డే క్రికెట్‌లో (వైట్ బాల్) బౌలర్లకు దడ పుట్టిస్తున్న యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి ఈ రాబోయే డొమెస్టిక్ సీజన్ అత్యంత కీలకంగా మారనుంది. రెడ్ బాల్ క్రికెట్ (డే మ్యాచ్) లో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఈ డాషింగ్ ఎడమచేతి వాటం ఓపెనర్‌కు అసలైన సవాల్ ఎదురు కానుంది. కేవలం సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడటమే కాకుండా సుదీర్ఘ సమయం క్రీజులో నిలబడి ఇన్నింగ్స్‌ను నిర్మించే సామర్థ్యం కూడా ఉందని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది. భారత క్రికెట్‌లో సరికొత్త ఆశాకిరణంగా ఉద్భవించిన వైభవ్ సూర్యవంశీపై రాబోయే దులీప్ ట్రోఫీలో అందరి కళ్లు నిలిచాయి. సెలెక్టర్లు ఒక పెద్ద సాహసమే చేస్తూ ఏకంగా జట్టు వైస్ కెప్టెన్ బాధ్యతలను అప్పగించారు. రెడ్ బాల్ ఫార్మాట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీలో వైభవ్ ప్రదర్శన అతని భవిష్యత్ టెస్టు కెరీర్‌ను నిర్దేశించనుంది.


**రంజీ ట్రోఫీలో సాగిన ప్రయాణం:**

బీహార్ తరఫున ఆడే వైభవ్ సూర్యవంశీ, జనవరి 2024లో ముంబైపై కేవలం 12 ఏళ్ల చిన్న వయస్సులోనే రంజీ డెబ్యూ చేసి చరిత్ర సృష్టించాడు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు అతని ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. రెడ్ బాల్‌ను ఎదుర్కొంటూ క్రీజులో నిలదొక్కుకోవడానికి అతను తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రంజీ ట్రోఫీలో మేఘాలయపై చేసిన 93 పరుగులే అతని అత్యధిక స్కోరు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో సెంచరీ సాధించలేదు. ఆడిన 8 రంజీ మ్యాచ్‌లలో కేవలం 17.25 సగటుతో 207 పరుగులు మాత్రమే చేశాడు. రంజీల్లో తక్కువ సగటుతో ఇబ్బంది పడుతున్నప్పటికీ, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో (వన్డేలు, టీ20లు) మాత్రం వైభవ్ బ్యాట్ నిప్పులు చెరుగుతోంది. ఐపీఎల్ 2026 లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, 16 మ్యాచ్‌లలో 237.30 భారీ స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి 'ఆరెంజ్ క్యాప్' దక్కించుకున్నాడు. ఇప్పటికే టీమిండియా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అతను, లిస్ట్-ఎ (వన్డే) మ్యాచ్‌లలో కూడా 43.88 సగటుతో 564 పరుగులు సాధించాడు.

**రెడ్ బాల్ ఎందుకు అసలైన పరీక్ష?**

చిన్న ఫార్మాట్‌లలో పరుగులు సాధించడం వైభవ్‌కు వెన్నతో పెట్టిన విద్య. కానీ ఐదు రోజుల సుదీర్ఘ మ్యాచ్ పూర్తిగా భిన్నమైన మానసిక పరిపక్వతను కోరుకుంటుంది. దులీప్ ట్రోఫీలో దేశంలోనే అత్యుత్తమ, అనుభవజ్ఞులైన పేసర్లు నిలకడైన లైన్ అండ్ లెంగ్త్‌తో దాడి చేయనున్నారు. ఇక్కడ వైభవ్ తన సహజ సిద్ధమైన దూకుడును కాస్త తగ్గించుకుని, జాగ్రత్తగా ఆడుతూ క్రీజులో ఎక్కువ సమయం గడిపే సహనాన్ని చూపించాల్సి ఉంటుంది. ఇక, వైభవ్ సూర్యవంశీకి ఈ దులీప్ ట్రోఫీ కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు, అతని టెస్టు కెరీర్‌కు అతిపెద్ద 'టర్నింగ్ పాయింట్'. వైస్ కెప్టెన్సీ బాధ్యతల ఒత్తిడి, నిరూపించుకోవాలనే కసి అతనిలోని అసలైన రెడ్ బాల్ క్రికెటర్‌ను బయటకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇక్కడ గనుక కొన్ని భారీ, మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లు ఆడితే, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని పాత రికార్డులు వెనక్కి పోయి, భారత టెస్టు జట్టులో చోటు కోసం అతని దావా అత్యంత బలంగా మారుతుంది.

## జావెలిన్ త్రో..నీరజ్ చోప్రాకు సిల్వర్



కామన్ వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్స్ అద్భుతంగా రాణిస్తున్నారు. అవకాశం ఉన్నచోట కచ్చితంగా పతకాలను దక్కించుకుంటున్నారు. ఇప్పటికే చాలా విభాగాలలో భారత అథ్లెట్స్ మెడల్స్ దక్కించుకోగా.. తాజాగా నీరజ్ చోప్రాకు సిల్వర్ వచ్చింది. జావెలిన్ త్రో ఛాంపియన్ నీరజ్ చోప్రాకు ఈ కామన్ వెల్త్ గేమ్స్ లో సిల్వర్ మెడల్ దక్కింది.2018లో గోల్డ్ సాధించి ఎనిమిది సంవత్సరాల తర్వాత కామన్ వెల్త్ గేమ్స్ లోకి రీ-ఎంట్రీ ఇచ్చాడు నీరజ్ చోప్రా. ఇందులో గోల్డ్ పై మ-రోసారి కన్నేశాడు. కానీ శ్రీలంక ఆటగాడు రుమేశ్ పతిగరే బిగ్ షాక్ ఇచ్చాడు. జావెలిన్ త్రోలో రుమేశ్ పతిగరే 89.75 మీటర్లు విసిరి గోల్డ్ దక్కించుకున్నాడు. 85.83 మీటర్లు విసిరి నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. దీంతో సిల్వర్ తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అటు మూడవ స్థానంలో 85.41 మీటర్లు విసిరి యశ్ వీర్ సింగ్ కాంస్యం దక్కించుకున్నాడు.

# బిజినెస్

## నిలువుగా ఎగిరే ఈ-విమానాలు



దేశంలో అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ఎగిరే, దిగే ఎలక్ట్రిక్ విమానాల (ఈవీటీఓఎల్)ను వినియోగించే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు సాధ్యాసాధ్యాలపై ఉమ్మడిగా అధ్యయనం చేసేందుకు జపాన్‌కు చెందిన ఈవీటీఓఎల్‌ల అభివృద్ధి, తయారీ సంస్థ స్కైడ్రైవ్‌తో పాటు సుజుకీ మోటార్ కార్పొరేషన్‌తో ఎయిరిండియా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా స్కైడ్రైవ్ ఈవీటీఓఎల్ సాంకేతికతను, ఎయిరిండియా విమానాల నిర్వహణ నైపుణ్యాన్ని, సుజుకీ మార్కెట్ అనుభవాన్ని ఉపయోగించుకొని ఎమర్జెన్సీ మెడికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయనున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు చిన్న నగరాల రోడ్లు కూడా అత్యంత రద్దీగా మారుతున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని వైద్యం కోసం దూర ప్రాంతాలకు తరలించడం లేదా కీలక ఔషధాల చేరవేత అత్యంత సవాలుగా మారింది. ఈవీటీఓఎల్‌ల వినియోగం ఈ సవాలును అధిగమించేందుకు దోహదపడనుంది.



## ఏటీఎఫ్ పై లీటరుకు రూ. 5 పెరిగిన ధర

ఈ రోజు ఉదయం దేశవ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన విషయం తెలిసిందే. కానీ విమానయాన సంస్థలకు మాత్రం షాక్ ఇచ్చింది. దేశంలో విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ -ఏటీఎఫ్) ధరలను చమురు మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. ఏటీఎఫ్ ధరపై లీటరుకు రూ. 5 మేర పెంపును వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలలో చోటుచేసుకుంటున్న మార్పులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ ధరలను సవరించినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో ఇంధన వ్యయం పెరిగి విమానయాన సంస్థల పై అదనపు ఆర్థిక భారం పడనుంది.విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చుల వాటా సుమారు 35 నుంచి 40 శాతం వరకు ఉంటుంది. ఏటీఎఫ్ ధర లీటరుకు రూ. 5 పెరగడంతో సర్వీసుల నిర్వహణ ఖర్చులు పెరిగిపోతాయని, ఈ భారనాన్ని తట్టుకోవడానికి రాబోయే రోజుల్లో విమానయాన సంస్థలు ప్రయాణ ఛార్జీలను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పండుగలు, పర్యటనల సీజన్ వస్తున్న తరుణంలో విమాన ఇంధన ధరలు పెరగడం ప్రయా-ణికుల జేబులకు చిల్లు పెట్టే అంశంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## జియో వార్షిక ప్లాన్‌తో అదిరిపోయే ఆఫర్..




నెలనెలా రీఛార్జ్ చేసే ఇబ్బందికి చెక్ పెట్టేలా రిలయన్స్ జియో రూ.3,599 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్‌లో 365 రోజుల వ్యాలిడిటీతో పాటు దేశవ్యాప్తంగా అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2.5GB హైస్పీడ్ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఏడాది మొత్తం 912GBకుపైగా డేటా వినియోగించే అవకాశం ఉంటుంది. 5జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో, అనుకూల స్మార్ట్‌ఫోన్ ఉంటే అన్‌లిమిటెడ్ 5జీ డేటా కూడా పొందవచ్చు.ఈ ప్లాన్‌లో డేటా, కాలింగ్‌తో పాటు పలు డిజిటల్ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. మూడు నెలల పాటు JioHotstar Mobile + Hollywood యాక్సెస్, 50GB Jio AI Cloud స్టోరేజ్, అదనపు చార్జీ లేకుండా 18 నెలల Google Gemini Pro సబ్‌స్క్రిప్షన్‌ను జియో అందిస్తోంది. దీంతో వినోదంతో పాటు ఏఐ ఆధారిత సేవలను కూడా వినియోగించుకోవచ్చు.ఇక రూ.3,999 ప్లాన్‌లో మరిన్ని డిజిటల్ సబ్‌స్క్రిప్షన్లు లభిస్తాయి. తక్కువ ధరలో దీర్ఘకాలిక ప్లాన్ కోరుకునేవారికి రూ.3,336 ప్లాన్ 336 రోజుల వ్యాలిడిటీతో అందుబాటులో ఉంది. ప్రధానంగా కాలింగ్ అవసరాలున్న వారికి రూ.2,025 ప్లాన్ అనుకూలంగా ఉంటుంది. అధిక డేటా వినియోగించే వారు, ఓటీటీ సేవలు, 5జీ, ఏఐ ఫీచర్లు కోరుకునే వారికి రూ.3,599 ప్లాన్ ఉత్తమ ఎంపికగా నిలుస్తోంది.

## ఇన్సూరెన్స్ రంగంలోకి పతంజలి




ఆయుర్వేద ఉత్పత్తులు, ఎఫ్ఎంసీజీ రంగంలో వ్యాపారం నిర్వహిస్తున్న పతంజలి ఆయుర్వేద్ కొత్తగా ఇన్సూరెన్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. దీనికోసం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేసేందుకు పతంజలి, డీఎస్ గ్రూప్‌కు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఆమోదం తెలిపింది. సుమారు రూ.4,500 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో పతంజలి 73.56 శాతం, డీఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను సొంతం చేసుకోనున్నాయి. ప్రస్తుత వాటాదారుల నుంచి ఈ రెండు సంస్థలు కలిసి దాదాపు 98 శాతం వాటాను తమ నియంత్రణలోకి తీసుకోనున్నాయి. ఈ లావాదేవీని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఐఆర్‌డీఏఐ సూచించింది. కొత్తగా లైసెన్స్ కోసం దరఖాస్తు చేయకుండా, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న బీమా సంస్థను కొనుగోలు చేయడం ద్వారా పతంజలి నేరుగా ఇన్సూరెన్స్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అంతేకాకుండా, ఈ డీల్‌తో పతంజలి తొలిసారిగా ఆర్థిక సేవల రంగంలో అడుగుపెట్టు అయింది. మోటార్, ఆరోగ్య, ఆస్తి, వాణిజ్య బీమా విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ 2025-26లో రూ.3,615.48 కోట్ల స్థూల ప్రీమియం నమోదు చేసింది. దేశవ్యాప్తంగా ఏజెంట్లు, కార్పొరేట్ భాగస్వాములు, ఆటోమొబైల్ డీలర్లతో విస్తృత పంపిణీ వ్యవస్థ కూడా కంపెనీకి ఉంది. మరోవైపు, పతంజలికి గ్రామీణ, సెమీ అర్బన్ మార్కెట్లలో ఉన్న బలమైన పంపిణీ నెట్‌వర్క్‌ను బీమా వ్యాపార విస్తరణకు ఉపయోగించుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.




# కార్తి, సూర్య మధ్య హోరాహోరీ..

కోలీవుడ్ వర్సటైల్ యాక్షన్ హీరో కార్తి ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ స్పై థ్రిల్లర్ మూవీ 'సర్దార్-2'. ఇప్పటికే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా టీజర్ రిలీజ్ చేసి హైప్ మరింత పెంచేశారు. ఇక ఈ సీక్వెల్‌లో తండ్రి పాత్రకు సంబంధించి కొంత ఫ్లాష్ బ్యాక్ మళ్ళీ చూపించబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈసారి తండ్రి కొడుకులు ఇద్దరూ యాక్షన్‌తో అదరగొట్టబోతున్నారని టీజర్ చూస్తేనే అర్థమవుతుంది. అలాగే కార్తీ, ఎస్ జే సూర్యల మధ్య హోరాహోరీ ఉన్నట్లు చూపిస్తూ.. సినిమాలో యాక్షన్ సీన్స్‌ను అదరగొట్టేశారు. మొత్తంగా ఈ టీజర్ సినిమాను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లింది. కాగా.. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ మూవీకి మిత్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మాళవిక మోహనన్ హీరోయిన్‌గా, ఎస్ జే సూర్య విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాను ముందుగా సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ రీసెంట్‌గా విడుదల చేసిన ఈ టీజర్ పోస్టర్‌లో మాత్రం ఈ డేట్ కనిపించకపోవడతో.. సినిమాను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే.. రిలీజ్‌పై మాత్రం ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు మేకర్స్.



# మనం వేసుకున్న నకిలీ ముసుగులు...

తాజాగా షూటింగ్ సెట్స్‌లో రజినీకాంత్‌తో తనకు జరిగిన ఒక ఆసక్తికరమైన సంఘటనను, ఆయన ఇచ్చిన ఒక స్పెషల్ గిఫ్ట్ గురించి రాశి ఖన్నా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. షూటింగ్ గ్యాప్‌లో ఒకరోజు తామిద్దరం మాట్లాడుకుంటున్న సమయంలో ఆధ్యాత్మికత గురించి చర్చ వచ్చిందని రాశి ఖన్నా తెలిపింది. ఆ సమయంలో రజినీకాంత్ 'లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్' అనే పుస్తకం పేరు చెప్పి, ఈ బుక్ ఎప్పుడైనా చదివావా? అని అడిగారని చెప్పారు.దానికి తాను లేదు అని చెప్పడంతో, రజినీకాంత్ మాట వరుసగా వదిలేయకుండా.. రెండు రోజులకే ఆ పుస్తకాన్ని స్వయంగా కొని తెచ్చి తనకు గిఫ్ట్‌గా ఇచ్చారని ఆమె చాలా ఆనందంగా వెల్లడించింది. "రజినీ సర్ ఈ పుస్తకాన్ని నాకు ఇవ్వడమే కాదు, దీనిపై నిన్ను ఆ తర్వాత ప్రశ్నలు కూడా అడుగుతానని చెప్పారు. ఆయన ఎక్కడ టెస్ట్ పెడతారో అని గత కొన్ని వారాలుగా ఈ పుస్తకాన్ని ఎంతో శ్రద్ధగా, క్రమం తప్పకుండా చదువుతున్నాను. నిజానికి ఈ బుక్ చదవడం నాకెంతో నచ్చింది. చదువుతున్న కొద్దీ కొన్ని పేజీలు నన్ను ఆలోచింపజేస్తున్నాయి" అని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది. అంతేకాకుండా ఈ పుస్తకం చదవడం వల్ల తాను నేర్చుకున్న ఒక గొప్ప జీవిత సత్యాన్ని కూడా ఆమె వివరించింది. "మనం ఎవరో మెచ్చుకోవాలని, ఇతరులను ఇంప్రెస్ చేయడం కోసం వేరే వాళ్లలా నటించడం మొదలుపెడతాం. అలా ఏళ్ల తరబడి ఇతరుల కోసం జీవిస్తూ మన అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోతాం. అందుకే ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆ నిశ్శబ్దం మనల్ని భయపెడుతుంది. జీవితంలో నిజమైన ఎదుగుదల అంటే కొత్తగా ఏదో అయిపోవడం కాదు, మనం వేసుకున్న నకిలీ ముసుగులను తీసేసి మనలా మనం ఉండటమే" అని రాశి ఖన్నా చెప్పారు. రజినీకాంత్ ఇచ్చిన ఈ గిఫ్ట్ తన జీవితంలో ఒక నిశ్శబ్ద పాఠం లాంటిదని ప్రశంసించారు.




# బాక్సాఫీసు వద్ద తొలిరోజే షాక్!

సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి తనయుడు ఘట్టమనేని జయకృష్ణ 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో టాలీవుడ్‌లోకి హీరోగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చాడు. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటించింది. భారీ అంచనాల నడుమ ఈ సినిమా జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యింది. అయితే, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయిందనే టాక్ వినిపిస్తోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న మరో హీరో కావడంతో అభిమానులు ఈ సినిమాపై భారీ ఆశలే పెట్టుకున్నారు.కానీ, విడుదలైన మొదటి రోజు నుంచి నెగెటివ్, మిశ్రమ స్పందన రావడం సినిమా కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపించింది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా కేవలం రూ. 1.25 కోట్ల గ్రాస్ వసూళ్లను మాత్రమే సాధించినట్లు తెలుస్తోంది. టిరుపతి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ లవ్ స్టోరీగా అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కించినప్పటికీ, కథలో ఇంటెన్సిటీ లోపించడం, సెకండాఫ్ ఆకట్టుకునేలా లేకపోవడం వల్ల సాధారణ ప్రేక్షకులు నిరాశకు గురయ్యారు. జయకృష్ణ నటన,మాస్ యాక్షన్ సీన్స్ బాగున్నప్పటికీ, బలహీనమైన కథ కారణంగా సినిమా నిలదొక్కుకోలేకపోయిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొదటి రోజే బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోవడంతో సూపర్ స్టార్ అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.





# 'ఫౌజీ'లో ఒకప్పటి స్టార్ హీరోయిన్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా డైరెక్టర్ హను రాఘవపూడి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ'. ఈ చిత్రంపై ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోను అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 1970ల నాటి యుద్ధ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికర వార్త ఇండస్ట్రీలో జోరుగా చక్కర్లు కొడుతోంది. అలనాటి అందాల తార జయప్రద ఈ చిత్రంలో అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాదు సినిమాలో ఆమె ప్రభాస్ తల్లి పాత్రను పోషిస్తున్నట్లు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇప్పటికే విడుదల తేదీని ఖరారు చేసుకున్న ఈ సినిమాపై డార్లింగ్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక అభిమానులకు మరో సర్‌ప్రైజ్ కూడా రెడీ అవుతుందని టాక్. ఆగస్టు 14న ఈ చిత్రం నుంచి ప్రత్యేక గ్లింప్స్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఈ గ్లింప్స్‌లో ప్రభాస్ పాత్రతో పాటు సినిమా విజువల్ టోన్, యుద్ధ నేపథ్యాన్ని చూపించే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. అయితే జయప్రద పాత్రతో పాటు ఆగస్టు 14 గ్లింప్స్ రిలీజ్‌కి సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# రణబీర్ పారితోషికం150 కోట్లు..

ఇండియన్ హిస్టరీలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మూవీ 'రామాయణం'. సుమారు రూ.4,800 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీలో శ్రీరాముడి పాత్రలో రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. అయితే రిలీజ్ కు ముందే ఈ మూవీ భారీ చర్చకు దారి తీస్తోంది. తాజాగా విడుదలైన ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, గ్రాండ్ స్కేల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు ఈ సినిమా తారాగణం పారితోషికాలపై కూడా ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా ఇందులో ఒక స్టార్ నటుడు ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకోకుండా చేసిన నిర్ణయం అందరి ప్రశంసలు అందుకుంటోంది. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం రణబీర్ కపూర్ మొత్తం రూ.150 కోట్లు పారితోషికంగా తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంటే ఒక్కో భాగానికి రూ.75 కోట్లు అందుకుంటున్నారని సమాచారం.అయితే ఈ మూవీలో కీలక పాత్ర పోషిస్తున్న వివేక్ ఒబెరాయ్ మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదంట. తనకు ఎలాంటి పారితోషికం అవసరం లేదని నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెప్పినట్లు స్వయంగా వివేక్ వెల్లడించారు. రీసెంట్ గా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తనకు రావాల్సిన మొత్తం పారితోషికాన్ని క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారుల చికిత్స కోసం విరాళంగా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తాను ఈ సినిమాని ఒక సినిమా కోణంలో కాకుండా, భారతీయ సంస్కృతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే గొప్ప ప్రయత్నంగా భావిస్తున్నానని వివేక్ ఒబెరాయ్ అభిప్రాయపడ్డారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడమే తనకు పెద్ద గౌరవమని, పారితోషికం కంటే సేవా కార్యక్రమానికి ఆ నిధులు వెళ్తే మరింత సంతోషంగా ఉంటుందని చెప్పారు.



# తీవ్రంగా గాయపడిన హీరోయిన్ రశ్మిక?

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వరుస సినిమాలతో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ రశ్మిక మందన్నకు ఊహించని షాక్ తగిలింది. ప్రస్తుతం వరుస పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ఆమె, ఒక డ్యాన్స్ సీక్వెన్స్ షూటింగ్ సందర్భంగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ వార్త ఇండస్ట్రీలోనూ, ఆమె అభిమానుల్లోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం రశ్మిక 'రణబాలి', 'మైసా' చిత్రాల షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాల కోసం వరుసగా హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు, కఠినమైన డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లు చేయాల్సి రావడంతో ఆమె శరీరానికి తీవ్ర ఒత్తిడి గురైంది. ఈ క్రమంలోనే ఆమెకు హిప్ ఏరియాలో పూర్తిగా టెండన్ డిటాచ్‌మెంట్ అయినట్లు వైద్యులు వెల్లడించారు.ఈ రకమైన గాయం వైద్యులను సైతం విస్మయానికి గురిచేసింది. సాధారణంగా ఇలాంటి తీవ్రమైన గాయాలు కఠినమైన సాధన చేసే క్రీడాకారుల్లో మాత్రమే వస్తుంటాయని డాక్టర్లు పేర్కొంటున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, రశ్మిక రాబోయే 6 వారాల పాటు ఎలాంటి కదలికలు లేకుండా పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, టెండన్ తిరిగి పూర్వ స్థితికి వచ్చి బలపడేందుకు ప్రత్యేకంగా రీహాబిలిటేషన్ కూడా అవసరమని తెలిపారు. ప్రస్తుతం పాన్-ఇండియా స్థాయిలో మోస్ట్ బిజీయెస్ట హీరోయిన్‌గా కొనసాగుతున్న రశ్మిక చేతిలో ఏకంగా నాలుగు భారీ చిత్రాల షూటింగ్స్ ఉన్నాయి. వీటితో పాటు దాదాపు 30 ప్రముఖ బ్రాండ్లకు ఆమె అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ అనూహ్య ప్రమాదం కారణంగా ఆమె నటిస్తున్న సినిమాలతో పాటు పలు యాడ్ షూటింగ్స్ కూడా తాత్కాలికంగా నిలిచిపోయే అవకాశం ఉంది. త్వరలోనే ఆమె కోలుకుని తిరిగి షూటింగ్స్‌లోకి రావాలని ఫ్యాన్స్, శ్రేయోభిలాషులు సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు.







# 'జడల్ జమానా' కోసం సిద్ధమా

నేచురల్ స్టార్ నాని ఫ్యాన్స్‌కు అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు 'ది ప్యారడైజ్' మేకర్స్. నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక రూమర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. వాటన్నిటికి చెక్ పెడుతూ.. టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. '1 నిమిషం 35 సెకన్ల మ్యాడ్ నెస్‌తో 'ది ప్యారడైజ్' టీజర్ ఆగస్టు 6న విడుదల కానుంది.. 'జడల్ జమానా' కోసం సిద్ధంగా ఉండండి' అంటూ టీజర్‌పై అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ఈ భారీ యాక్షన్ డ్రామాలో నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు, రాఘవ జుయల్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. రిలీజ్‌పై త్వరలో ప్రకటన రానుంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**